ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

5

శ్రీ పొట్టిశ్రీరాములు


నెల్లూరు

జిల్లా వార్తలు

బుధవారం 27 మార్చి 2024



సోమశిలలో పడిపోతున్న నీటిమట్టం



అనంతసాగరం : సోమశిల జలాశయంలో నీటిమట్టం పడిపోతోంది. డ్యాం పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా మంగళవారం 10.449 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ ఉత్తర కాలువకు 300, డెల్టాకు 1500, దక్షిణ కాలువకు 300 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

రంజాన్ వేళలు ఇఫ్తార్ (బుధవారం) : 6.22 | సహరి (గురువారం) : 4.49

ఉష్ణోగ్రతలు నెల్లూరు : 34.8 25.4 | కావలి : 34.0 24.0 | కందుకూరు : 35.0 25.0 | ఆత్మకూరు : 38.0 24.0 | ఉదయగిరి : 34.0 24.0

నేతలకు నచ్చేలా.. జనం మెచ్చేలా!

● ముస్తాబవుతున్న ప్రచార రథాలు ● అత్యాధునిక వసతులతో తయారీ ● ఒక్కో వాహనానికి రూ.1 లక్ష నుంచి 6 లక్షల వరకు ఖర్చు ● నెల్లూరులో ఒక్కరే స్పెషలిస్ట్

ఎన్నికల వాతావరణం హీటెక్కుతోంది. ప్రధాన పార్టీల అభ్యర్థుల పేర్లు ఖరారు కావడంతో ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు, తమ పార్టీల మ్యానిఫెస్టోలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు నాయకులు పోటాపోటీగా జనం బాట పడుతున్నారు. ఎన్నికల్లో ప్రచారమే కీలకం కావడంతో ప్రచార రథాలను సిద్ధం చేసుకుంటున్నారు. ఈ రథాలను తయారుచేసే నిపుణులు వీటిని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. పార్టీ విధివిధానాలు, హామీలు, పార్టీ అధినేతలు, ముఖ్యుల ఫొటోలు వాహనాలకు చుట్టూ ఏర్పాటు చేయడంతోపాటు వాహనంలో ప్రత్యేకంగా స్టేజీ, సౌండ్ సిస్టమ్, కళ్లు మిరుమిట్లు గొలిపేలా లైటింగ్‌లతోపాటు జనరేటర్‌ను సైతం అమర్చుతున్నారు. నాడు ఎన్టీఆర్ చైతన్యరథం పేరుతో ప్రారంభమైన ప్రచార రథాలు నేడు రూపాలు మార్చుకుంటూ ఆధునికతను సంతరించుకుని తుది మెరుగులు దిద్దుకుంటున్నాయి. నెల్లూరులో ఎక్కువ మంది అభ్యర్థుల 'రథాలు' అన్సర్ గ్యారేజీలో ముస్తాబవుతున్నాయి.

నెల్లూరు (విద్య), మార్చి 26 : ప్రజల వద్దకు వెళ్లిన సమయంలో పార్టీల నేతలు తమ అభిప్రాయాలను ప్రజలతో పంచుకునేందుకు ఒక వేదిక ముఖ్యం కావడంతో ఈ వేదికనే తమ ప్రచార రథాల్లో ఏర్పాటు చేసుకుని పార్టీ విధివిధానాలను వాహనం మీదనుంచే ప్రజలకు తెలియ చేస్తున్నారు. దీనికోసంగా తమ ప్రచార రథాలను అత్యాధునికంగా తీర్చి దిద్ది పార్టీ గుర్తులను, మ్యానిఫెస్టోను, అధినేతల ఫొటోలను అందంగా వాహనంపై ముద్రిస్తున్నారు. ఇప్పటికే పలు వాహనాలు ఆయా నియోజక వర్గాలకు చేరుకుని ప్రచారాలు కూడా ప్రారంభించగా మరికొన్ని ప్రచార రథాలు వేగవంతంగా రూపుదిద్దుకుంటున్నాయి. తక్కువ ఖర్చుతో ప్రచార వాహనాలను సిద్ధం చేస్తున్నారు. వాహనాల తయారీలో ప్రత్యేక శ్రద్ధ చూపుతూ నేతలు మెచ్చేలా తయారు చేస్తున్నారు. ఓటర్లు, ప్రజలంతా కనపడేలా వాహనానికి ఇరువైపులా ఎల్‌ఈడీ లైట్లు, అత్యధిక హార్స్‌పవర్ కలిగిన జనరేటర్, కార్డ్‌లెస్ మైక్, కార్డ్‌మైక్ అమర్చుతున్నారు. ప్రధానంగా వాహనానికి వాటర్ ప్రూఫ్ కార్పెట్‌ను ప్రత్యేకంగా ఏర్పాటు చేయడంతో పాటు స్టీల్‌తో తయారు చేసిన మెట్లు, ఎల్‌ఈడీ డిస్‌ప్లే బోర్డులు, గన్‌మెన్‌లు నిలిచేందుకు ప్రత్యేక ఫుట్‌బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు. సదరు పార్టీలకు సంబంధించిన అధినేత, నేతల ఫొటోలు, పార్టీ జెండాలు, నినాదాలను కూడా అందంగా తీర్చిదిద్దుతున్నారు.

● ఆర్థిక సామర్థ్యాన్ని బట్టి..

ప్రచార రథాలను సర్వాంగసుందరంగా, అత్యాధునికమైన హంగులతో సిద్ధం చేసేందుకు వారి సామర్థ్యాన్ని బట్టి రూ.1 లక్ష నుంచి 6లక్షల వరకు వెచ్చిస్తున్నారు. గతంలో ఈ రథాలకు బొలెరో క్యాంపేర్ వాహనాన్ని అధికంగా ఉపయోగించగా తాజాగా ఇసూజి వాహనాలనూ వినియోగి స్తున్నారు. ఇసూజి వాహనాలు శ్రీ సిటీలోనే తయారవుతుండటంతో ఈ వాహనాలకు రాష్ట్రంలో టాక్స్ మినహాయింపు ఉంటుంది. ఎన్నికల సమయంలో ఎవరి పనుల్లో వారు బిజీగా ఉండడంతో కొందరు వాహనాల టాక్స్ విషయం మరిచిపోతుంటారు. ఈ సమయంలో వాహనాన్ని తనిఖీ చేసి టాక్స్ చెల్లించకుంటే వాటిని అధికారులు సీజ్ చేసిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఈ నేపథ్యంలో అటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికశాతం మంది నేతలు ఇసూజీ వాహనాల వైపే మొగ్గు చూపుతున్నారు

● మూడు దశాబ్దాల అనుభవం

వాహనాలను ప్రచార రథాలుగా సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడంలో నెల్లూరులోని అన్సర్ కార్‌కేర్‌కు మూడు దశాబ్దాల అనుభవం ఉంది. ఈ కార్‌కేర్ అధినేత షేక్.అన్సర్‌బాషా గతంలో బృందావనంలో ఉన్న తన షెడ్‌ను ప్రస్తుతం అయ్యప్పగుడి సమీపంలోని జ్యోతినగర్‌కు మార్చు చేశారు. తొలిసారిగా ఆనం కుటుంబానికి అప్పటి జీప్ వాహనాన్ని విజయరథం పేరుతో ప్రచారరథంగా మార్చు చేశారు. నాటి నుంచి నేటి వరకు ఎంతో మంది ప్రజాప్రతినిధులకు, నేతలకు పార్టీలకు అతీతంగా ప్రచార రథాలను సిద్ధం చేసి ఇస్తున్నారు. వాహనాన్ని తన వద్దకు తీసుకువచ్చిన తరువాత దానికి ఫైపింగ్‌ల ద్వారా స్టేజీని సిద్ధం చేసి లైటింగ్, స్టిక్కరింగ్, మైక్‌సెట్, ఫ్యాబ్రికేషన్, స్టేజీలు ఇతర హంగులను ఏర్పాటు చేస్తున్నారు. రథాలను హడావుడిగా సిద్ధం చేసేందుకు ఇష్టపడని అన్సర్ కేవలం ఎన్నికల సమయంలో 15 నుంచి 20 వాహనాలను మాత్రమే సిద్ధం చేసి అందిస్తారు. అది కూడా సమయం ఉంటేనే, లేని పక్షంలో తాను చేయలేనని కరాఖండీగా చెప్పేస్తారు. ఒక్కో వాహనం తయారు చేసేందుకు 15 రోజుల నుంచి నెలరోజుల సమయం పడుతుందని అన్సర్ తెలిపారు. ఒకసారి తన వద్ద తయారు చేసుకున్న వాహనం క్రమం తప్పకుండా తనవద్దకే వస్తుందని, ఏ ఎన్నికలు వచ్చినా కూడా వాటిని తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుం డా సిద్ధం చేసి ఇస్తాన న్నారు. ఇప్పటికే జిల్లాలోని అన్ని నియోజక వర్గాలకు వాహనా లను సిద్ధం చేశానని, ఇంకా మరికొన్ని వాహనాలు సిద్ధమవుతున్నాయన్నారు.



రూపుదిద్దుకుంటున్న ప్రచార రథాలు



వాహనానికి లైట్లు అమర్చుతూ..



అన్సర్ కార్‌కేర్ అధినేత షేక్ అన్సర్‌బాషా



జనరేటర్ అమరిక



వైద్యశిబిరంలో కనిపిస్తున్న వారంతా ఆరోగ్య సిబ్బందే..

ఆరోగ్య సురక్ష.. వెలవెల

రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆరోగ్య సురక్ష శిబిరాలకు ప్రజల నుంచి స్పందన కరువవుతోంది. కొండాపురం మండలం గుడవళ్లూరు పంచాయతీ పరిధిలో మంగళవారం వైద్యశిబిరం జరిగింది. ఈ శిబిరం ఏర్పాటుపై ముందుగానే ప్రచారం చేసినా ప్రజల నుంచి ఆదరణ కరువయ్యింది. దీంతో శిబిరంలో దాదాపు కుర్చీలన్నీ ఖాళీగానే దర్శనమిచ్చాయి. కార్యక్రమాన్ని పర్యవేక్షించాల్సిన అధికారులు కూడా పట్టించుకోకుండా ఫొటోలకు ప్రాధాన్యమిచ్చారు. అంగన్‌వాడీ స్టాఫ్ల కూడా శిబిరం వద్ద కనిపించలేదు.

- కొండాపురం

● కాపులేక వెలవెలబోతున్న చెట్లు

● ఈసారి 'బంగినపల్లి' అందని ద్రాక్షేనా!?

మామిడీలా!





● దిగుబడి తగ్గుదలకు కారణాలెన్నో!

● పెట్టుబడి కూడా దక్కదేమోనన్న భయం

● బిక్కముఖంతో కౌలు రైతులు

ఉలవపాడు, మార్చి 26 : ఎన్నడూ లేనివిధంగా ఈసారి మామిడి సాగు కౌలు రైతులను నట్టేట ముంచింది. ఉలవపాడు మండల పరిసరాల్లో విరివిగా సాగయ్యే బంగినపల్లి ఈ ఏడాది మామిడి ప్రియులకు అందని ద్రాక్షగా మారనుంది. సకాలంలో వర్షాలు కురవకపోవడం, అదును తప్పి పూత వేయడం, ఫలాభివృద్ధి చెందకపోవడం, త్రిప్స్ వంటి వైరస్, తేనెబంకతో పూతలు రాలిపోవడం వంటి కారణాలు దిగుబడిపై ప్రభావం చూపుతున్నాయి. సహజంగా ఎకరాకు బంగినపల్లి మామిడి 3-4 టన్నుల దిగుమతి ఉంటుంది. ఈ ఏడాది అర టన్ను దిగుబడి కూడా వచ్చే అవకాశం లేదని కౌలుదారులు ఆవేదన చెందుతున్నారు. అన్నిటిని తట్టుకొని నిలబడిన మామిడిపై తేనెబంక, పురుగు గోకడం వంటి ప్రభావాలు చూపడంతో కాయ నాణ్యత తగ్గిపోయింది. దీంతో దక్కిన కాపు కాస్త నాణ్యత లోపంతో మార్కెట్‌లో పెద్దగా ధర పలకదని రైతులు వాపోతున్నారు.

● నష్టాలు తప్పవా!?

మామిడి సాగులో ఈ ఏడాది భారీ నష్టాలను రైతులు చవిచూడబోతున్నారు. కౌలు రైతులు ఎక్కువ మంది కిందటి ఏడాది కాపు పూర్తి కాగానే తరువాత ఏడాది కాపుకోసం ముందస్తు బేరం కుదుర్చుకుని తోటలు కొనుగోలు చేస్తారు. అనంతరం సేద్యంలో భాగంగా అవసరమైతే నీళ్ల కట్టడం, దుక్కిదున్నకం, పూతలు వేసి పిందెలు నిలబడే వరకు పురుగు మందులు వాడుతూనే ఉంటారు. ఇవన్నీ కలిపి మామిడి కాపు కౌలు కొనుగోలుతో సమానంగా ఖర్చులు అవుతుంటాయి. ఈ ఏడాది సేద్యం ఖర్చులు కూడా బాగా పెరిగిపోవడంతో పెట్టుబడిలో పావలా వంతు వచ్చినా సంతోషమని రైతులు ఆవేదన చెందుతున్నారు.

● భారీగా పలుకుతున్న ధర

దిగుబడి తక్కువ కావడంతో ముందస్తు వచ్చిన మామిడి ధర రూ.లక్ష వరకు పలుకుతుందని తోటలోనే కేజీ ధర రూ.120 వరకు పలుకుతుందని వ్యాపారులు చెబుతున్నారు. ఉలవపాడు, గుడ్లూరు, లింగసముద్రం, కావలి మండలాల పరిసర ప్రాంతాలలో ముందస్తు వచ్చిన మామిడి కోతలు జరుగుతున్నాయి. ఇదంతా ఎక్కువ భాగం ఉలవపాడు జాతీయ రహదారికి ఇరువైపులా మామిడి అంగళ్ల వ్యాపారులు కొనుగోలు చేస్తుంటారు. అలాంటిది హైవేకు ఇరువైపులా ఈపాటికి అంగళ్లు ఏర్పాట్లు చేయాల్సి ఉండగా కాపుసరిగా రాకపోవడం, వచ్చిన కాపు అనుకూల ధర పలకపోవడంతో హైవే వ్యాపారులు అంగళ్ల ఏర్పాటులో వెనుకంజ వేస్తున్నారు.

● రమణీయం రంగనాథుడి కల్యాణం



శ్రీవారి కల్యాణం జరుపుతున్న అర్చకులు

నెల్లూరు (సాంస్కృతికం) మార్చి 26 : తల్పగిరి రంగనాథస్వామి బ్రహ్మోత్సవాల్లో మంగళవారం రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత తల్పగిరి రంగనాథస్వామి కల్యాణం రమణీయంగా జరిగింది. ముందుగా మూలవరులకు విశేష పూలంగి సేవ జరిగింది. పెళ్లి కుమారుడిగా రంగనాథుడిని, పెళ్లి కుమార్తెలుగా శ్రీదేవి, భూదేవిలను విశేషంగా అలంకరించారు. అనంతరం మంగళవాయిద్యాలు, వేదపండితుల మంత్రోచ్ఛరణ, తరలివచ్చిన భక్తజనం నడుమ వివాహతంతును వేడుకగా నిర్వహించారు. అనంతరం కలల్యాణ మూర్తులకు నగరోత్సవం జరిగింది. కాగా, టీటీడీ తరఫున స్వామిఅమ్మవార్లకు అధికారులు పట్టువస్త్రాలు సమర్పించారు. తెల్లవారుజామున గజవాహన సేవ వైభవంగా జరిగింది. ఈ వేడుకలకు ఛైర్మన్ శ్రీనివాసులు, సహాయ కమిషనర్, ఈవో డబ్బుగుంట వెంకటేశ్వర్లు, అర్చకస్వాములు, సిబ్బంది పర్యవేక్షించారు.

● నేడు రథోత్సవం

బుధవారం ఉదయం 8.30 గంటలకు రథంపై రంగనాథుడు ఊరేగనున్నారు. ఈ వేడుకను చూసేందుకు భక్తజనం తరలిరానుంది.

ప్రచారాలకు అనుమతి తప్పనిసరి : కలెక్టర్

నెల్లూరు (హరనాథపురం), మార్చి 26 : రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ప్రచారాలకు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని కలెక్టర్ హరినారాయణన్ ఒక ప్రకటనలో సూచించారు. సమావేశాల నిర్వహణ, మైక్ సెట్టింగ్, ఆయా పార్టీల తాత్కాలిక కార్యాలయాల ఏర్పాటు, వాహనాల వినియోగం, ప్రదర్శనలు, అందులో ఉపయోగించే లౌడ్ స్పీకర్లు, వీధి సమావేశాలు, గాలి బెలూన్ల ఏర్పాటు, అంతర జిల్లాల ప్రచార వాహనాలు, బ్యారికేడ్ల ఏర్పాటు, మైకులు లేకుండా ఏర్పాటు చేసే సమావేశాలు, ఇంటింటి లేదా గడపగడప ప్రచారం చేయడానికి ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారి నుంచి అనుమతి తీసుకోవాలని పేర్కొన్నారు. కరపత్రాల పంపిణీ, జెండాలు, బ్యానర్ల ఏర్పాటు, వాల్ పోస్టర్లు అతికిం చడం, హోర్డింగ్‌ల ఏర్పాటుకూ అనుమతులు తీసుకోవాలని తెలిపారు. అలాగే పత్రికా ప్రకటనలు, స్టిక్కర్లు అతికించటం, సాంస్కృతిక కార్యక్రమాలు తదితర ఏ కార్యక్రమం అయినా ప్రచారంలో భాగంగానే పరిగణిస్తామని తెలిపారు. అనుమతి తీసుకోకుంటే ఎన్నికల నియమావళి ఉల్లంఘన కిందకు వస్తుందని తెలిపారు. అలాగే, ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రసారమయ్యే రాజకీయ ప్రచార ప్రకటనలకు ముందస్తు అనుమతి తప్పనిసరి అని తెలిపారు.

మేం మారమంతే!

కోడ్ అమలులోకి వచ్చి 10 రోజులవుతున్నా ప్రభుత్వ ఉద్యోగులు మాత్రం అధికార వైసీపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తూనే ఉన్నాయి. వలంటీర్లు, ఫీల్డు అసిస్టెంట్లు, డీలర్లు, వీఆర్వోలో ఇలా ఉద్యోగులు అధికార పార్టీ తరఫున ప్రచారం చేస్తున్నారు. సోమవారం పొదలకూరులోని కాకాణి రమణారెడ్డి కాలనీలో రాష్ట్ర మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి కుమార్తె పూజిత ప్రచారం నిర్వహించారు. ఇందులో తోడేరు, పొదలకూరు ప్రాంతాలకు చెందిన ఆశా కార్యకర్తలు సుమలత, చైతన్య పాల్గొని, కరపత్రాలు పంపిణీ చేయడం విమర్శలకు తావిచ్చింది.

- పొదలకూరు



ఎన్నికల విధుల్లో పొరపాట్లు రానీయొద్దు!

● అధికారులతో కలెక్టర్ హరినారాయణన్



కలువాయిలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్, తిరుపతి జేసీ

కలువాయి : ఎన్నికల విధులపై అవగాహన పెంచుకుని పొరపాట్లు జరగకుండా పని చేయాలని కలెక్టర్ హరినారాయణన్ అధికారులకు సూచించారు. స్థానిక ఉమామహేశ్వరి కల్యాణమండపంలో మంగళవారం కలెక్టర్, తిరుపతి జాయింట్ కలెక్టర్, వెంకటగిరి నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి హెచ్‌ఎం.ధ్యానచంద్ర ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందితో సమావేశమ య్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఓటుహక్కు వినియోగించు కునేందుకు అవసరమై చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం కలువాయి ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రాన్ని వారు పరిశీలించి, అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఎల్వోలు, సెక్టార్ అధికారులు, ఎంపీడీవో ప్రభాకర్, తహసీల్దారు సంజీవకుమారి, ఎస్ఐ అయ్యప్ప పాల్గొన్నారు.

సరిహద్దు ప్రాంత చెక్‌పోస్టుల తనిఖీ



వరికుంటపాడు : చెక్‌పోస్టులో సిబ్బందికి సూచనలిస్తున్న ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి

ఉదయగిరి, మార్చి 26: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో కోడ్ ఉల్లం ఘిస్తే ఎంతటివారి నైనా ఉపేక్షించేది లేదని ఎస్పీ కె.తిరుమలేశ్వర రెడ్డి అన్నారు. మంగళ వారం స్థానిక సర్కిల్ కార్యాలయం, పోలీస్‌స్టేష న్లను తనిఖీ చేసి మాట్లా డారు. కోడ్ అమలులో భాగంగా జిల్లా వ్యాప్తంగా సరిహద్దు ప్రాంతాల్లో 18 చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి 26ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలతో తనిఖీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మద్యం, నగదు తరలించకుండా తీసుకున్నామన్నారు. చెక్‌పోస్టుల వద్ద విధులు నిర్వహించే సిబ్బందికి ప్రభుత్వ ఆదేశాలు జారీ చేశామని, తప్పు చేస్తే దండన తప్పదన్నారు. కార్యక్రమంలో సీఐ గిరిబాబు, ఎస్ఐ ఇంద్రసేనారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీతారామపురం/వరికుంటపాడు: సీతారామపురం మండలం నారాయణంపేట, చిన్ననాగంపల్లి రహదారులపై ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులను ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన వెంట సీఐ గిరిబాబు, ఎస్ఐ అనూష పాల్గొన్నారు. అలాగే వరికుంటపాడు చెక్‌పోస్టు, పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. డీఎస్పీ వెంకటరమణ, సీఐ గిరిబాబు, ఎస్ఐ తిరుపతయ్య పాల్గొన్నారు.

మండే వేసవి..

● జీజీహెచ్‌లో పనిచేయని ఫైర్‌సేఫ్టీ పరికరాలు
● 750 పడకలున్న ఆసుపత్రికి పొంచి ఉన్న ప్రమాదం

మంటలొస్తే ఎలా?

నెల్లూరులోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి(జీజీహెచ్)కి ఈ వేసవిలో ప్రమాదం పొంచి ఉంది. వేలాది మంది రోగులు, వారి సహాయకులు, వైద్యులు, సిబ్బంది ఉండే ఈ ఆసుపత్రిలో అగ్ని ప్రమాదం సంభవిస్తే వెంటనే నివారణ చర్యలు తీసుకోలేని పరిస్థితి నెలకొంది. అత్యంత పటిష్టంగా ఉండాల్సిన అగ్నిమాపక వ్యవస్థ బలహీనంగా మారింది. ఫైర్‌సేఫ్టీ పరికరాలు పనిచేయక పోయినా వాటి మరమ్మతులకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయక పోవటంపై రోగులు, ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

● నాలుగేళ్లుగా మొరాయిస్తున్న మోటార్లు
● మరమ్మతులకు నిధులివ్వని రాష్ట్ర ప్రభుత్వం
● వందలాది మంది రోగులు, ఉద్యోగులు
● ఎండాకాలంలో అప్రమత్తత మరింత అవసరం


అగ్నిమాపక వ్యవస్థకు సంబంధించి పనిచేయని మోటార్లు

నెల్లూరు(వైద్యం), మార్చి 26 : ప్రభుత్వ ఆసుపత్రుల్లో అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వం డాంభికాలు పలుకుతున్నా జీజీహెచ్‌లో మాత్రం అవి అమలు కావటం లేదు. ప్రభుత్వ వైద్య కళాశాలకు అనుబంధంగా 2013లో అందుబాటులోకి వచ్చిన ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో నూతన నిర్మాణాలకు అనుగుణంగా అప్పట్లో ఫైర్‌సేఫ్టీ పరికరాలు ఏర్పాటు చేశారు. అయితే అవి నాలుగేళ్లుగా పనిచేయడం లేదు. పరికరాలతోపాటు పైపులు వాటికి ఉన్న ట్యూబులు కూడా దెబ్బతిన్నాయి. వాటిలో కొన్ని తుప్పుపట్టాయి. ఈ క్రమంలో అగ్ని ప్రమాదం సంభవిస్తే మంటలను అదుపుచేయడం కష్టమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. గతంలో రాష్ట్రంలోని ఎన్నో ఆసుపత్రుల్లో అగ్ని ప్రమాదాలు సంభవించి ఎందరో మృత్యువాతపడ్డ విషయం విదితమే.

డీఎంఈ దృష్టికి తీసుకెళ్లాం..

జీజీహెచ్‌లో ఫైర్ సేఫ్టీ పరికరాల మరమ్మతుకు సంబంధించి ఉన్నతాధికారులకు నివేదించాం. ఇక్కడ ఫైర్‌సేఫ్టీ పరికరాలను వెంటనే అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం ఫైర్ ఫైటింగ్ పరికరాలు ఉన్నాయి. ఈ వేసవిలో ఏదైనా అగ్ని ప్రమాదం సంభవిస్తే కొంత వరకు అవి కాపాడుతాయి. పూర్తిస్థాయిలో ఫైర్‌సేఫ్టీ పరికరాలను సిద్ధం చేసుకునేలా డీఎంఈతోపాటు కలెక్టర్ దృష్టికి సమస్యను తీసుకువెళుతున్నాం.

- డాక్టర్ సిద్దానాయక్, జీజీహెచ్ సూపరింటెండెంట్

● పనిచేయని మోటార్లు

ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఐదు అంతస్థులలో ఉంది. దీనికి అనుబంధంగా ప్రసూతి విభాగం, పాత పెద్దాసుపత్రి భవనం ఉన్నాయి. వీటికి చెంతనే ప్రభుత్వ వైద్య కళాశాల, దీనికి దగ్గరలో వైద్య విద్యార్థుల హాస్టల్ భవనాలు ఉన్నాయి. ఇంత పెద్దఎత్తున భవనాలు ఉన్నా ఎప్పుడో పదేళ్ల క్రితం ఏర్పాటు చేసిన అగ్నిమాపక వ్యవస్థే ఇప్పటికీ కొనసాగుతోంది. దానికి సంబంధించిన పరికరాలు కూడా ఏడాది క్రితం మూలనపడ్డాయి. అగ్నిప్రమాదం సంభవిస్తే వెంటనే మంటలను ఆర్పివేసేందుకు ఆసుపత్రి పరిధిలో మూడు పెద్ద నీటి మోటార్లను ఏర్పాటు చేశారు. కానీ, ఇవి ఏడాదిన్నరగా పనిచేయకపోయినా మరమ్మతులకు నోచుకోలేదు. ఆసుపత్రిలో నిధులు లేవంటూ అత్యవసరమైన మోటార్ల విషయంలోనూ కాలయాపన చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనన్న అభద్రత భావం రోగులు, వైద్యులు, సిబ్బందిలో నెలకొంది. ఈ ఏడాది వేసవి మరింత తీవ్రంగా ఉంటుందన్న హెచ్చరికల నేపథ్యంలో ఇప్పటికైనా ఉన్నతాధికారులు తక్షణ చర్యలు చేపట్టాల్సిన ఆవశ్యకత ఉంది.

అన్ని విభాగాల్లో అదే తీరు

జీజీహెచ్‌లో పలు విభాగాలున్నాయి. ప్రత్యేకంగా ప్రసూతి వార్డులో 200 మంది వరకు గర్భవతులు, బాలింతలు ఉంటారు. ఇక్కడే పై అంతస్తులో చిన్నపిల్లల విభాగం ఉంది. అందులో 50 మంది వరకు పిల్లలు చికిత్స పొందుతుంటారు. ఐపీ బిల్డింగ్‌లోనూ నాలుగు ఫ్లోర్లలో రోగుల వార్డులు ఉన్నాయి. వీటితో పాటు 10 ఆపరేషన్ థియేటర్లు ఉన్నాయి ఇలాంటి పరిస్థితిలో అగ్ని ప్రమాదాలు సంభవిస్తే వాటి నివారణకు ఎలాంటి చర్యలు తీసుకునే వీలు లేదు. ప్రమాద సమయంలో ఆసుపత్రి బయటకు పరుగులు తీయాలన్నా గర్భవతుల, బాలింతలు, చిన్నారులు నానాకష్టాలు పడాల్సిన పరిస్థితి. అయినా ఆసుపత్రి వర్గాలు ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్న దాఖలాలు లేవు.

18 పరికరాలు ఉన్నా ప్రయోజనమేది..?

ఆసుపత్రిలో చిన్న అగ్ని ప్రమాదం సంభవిస్తే తక్షణం నివారించేందుకు ఫైర్ ఫైటింగ్ ట్రాలీ మోటార్లు ఏడాది క్రితం వచ్చాయి. విజయవాడ నుంచి క్రాంటన్ గ్రేప్ కంపెనీకి చెందిన 18 మోటార్లను కలెక్టర్ నిధులు రూ.10 లక్షలతో కొనుగోలు చేశారు. ఏ అంతస్థులో అగ్నిప్రమాదం సంభవించినా దీనికి అమర్చిన ట్రాలీ ద్వారా మోటార్లను నెట్టుకుని ప్రమాదం జరిగిన ప్రాంతానికి పోయే వీలుంటుంది. అక్కడ ఉన్న నీటి కొళాయిలకు ఈ మోటారుకు అమర్చిన పైపు అనుసంధానం చేసి నీటి చిమ్మే అవకాశం ఉంటుంది. అయితే ఏదైనా పెద్ద అగ్నిప్రమాదం సంభవిస్తే మాత్రం ఈ పరికరాలు దానిని నివారించలేవు.



ఇన్‌పేషెంట్ వార్డులో రోగులు, నిరుపయోగంగా ఫైర్‌సేఫ్టీ పైపులైను



● 737 గ్రామాలకు 328 గ్రామాల్లోనే పూర్తి
● ఎల్‌పీ నెంబరు జారీలోనూ అసమగ్రత
● గడువు దాటిపోయినా అసంపూర్ణం
● పైగా గ్రామాల్లో గొడవలు
● నెరవేరని ప్రభుత్వ హామీ

రీసర్వే అభాసుపాలు

నెల్లూరు(హరనాథపురం), మార్చి 26 : ప్రభుత్వం చేపట్టిన భూముల రీసర్వే అభాసుపాలైంది. ఈ విధానం ద్వారా అనాదిగా ఉన్న రెవెన్యూ భూ రికార్డులు కూడా అస్తవ్యస్తంగా మారినట్లు సమాచారం. అంతేకాక గ్రామీణ ప్రాంతాల్లో భూముల సొంతదారుల మధ్య గొడవలు కూడా మొదలైనాయి. ప్రశాంతంగా ఉన్న పల్లెల్లో వివాదాలకు ఈ సర్వే కారణమవుతోంది. అర్హులైన రైతులు వారి భూములపై శాశ్వత హక్కులు పొందటం అటుంచి ఉన్నవి కోల్పో వాల్సి వస్తోంది. అన్ని గ్రామాల్లో సర్వేను పూర్తి చేయడానికి అధికారులు యత్నించినా కొన్ని చోట్ల రైతులు సహకరించ పోవటంతో ఈ ప్రక్రియకు విఘాతం కలిగింది. మొత్తంగా రీసర్వే సకాలంలో పూర్తి చేసి రైతుల పొలాలకు హద్దు రాళ్లు ఏర్పాటు చేసి గొడవలకు ఏలాంటి ఆస్కారం లేకుండా చేస్తామన్న ప్రభుత్వ హామీ మాత్రం నెరవేరలేదు.

జిల్లాలో రీ సర్వే 2020 డిసెంబరు 21న మొదలైంది. ఈ ఏడాది జనవరి నాటికి పూర్తి చేయాల్సి ఉన్నా సంపూర్ణం కాలేదు. ఎన్నికల కోడ్ అమల్లోకి రావటంతో అర్థంతరంగా ఆగిపోయింది. చాలా గ్రామాల్లో రీసర్వే చేయించుకోవడానికి రైతులు ముందుకు రాలేదు. ఒక వేళ వచ్చినా సర్వే సందర్భంలో తమ భూమి విస్తీర్ణం తగ్గిందనే ఫిర్యాదులు పెరిగాయి. భూమి విస్తీర్ణం కొన్ని చోట్ల తక్కువగా చూపటం వల్ల అవసరానికి పంట రుణాలు పొందాల నుకునే రైతులకు బ్యాంకుల్లో గతంలో కంటే తక్కువ రుణం ఇస్తున్నారు. విస్తీర్ణంలో వ్యత్యాసంపై అధికారులకు ఫిర్యాదు చేస్తే మళ్లీ కొలతలు వేసి భూ హక్కు పత్రాన్ని జారీ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

అందరికీ ఇవ్వని ఎల్‌పీ నెంబరు

సాధారణంగా అడంగల్, 1బీ రికార్డుల ద్వారా భూముల వివరాలు తెలుసుకునే వీలుండేది. రీసర్వే ద్వారా ఎల్‌పీ (ల్యాండ్ పార్శిల్ నంబరు)ను సర్వే నంబరు స్థానంలో కొత్తగా ఇచ్చారు. ఈ నంబరు ఆధారంగా భూముల రిజిస్ట్రేషన్ చేపట్టాల్సి ఉంది. అయితే రైతులందరి భూములకు ఎల్‌పీ నంబరు ఇవ్వలేదు. జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో సర్వే పూర్తి కానందున అందరి భూములకు ఎల్‌పీ నంబరు ఇవ్వలేదని తెలిసింది. దీంతో ప్రస్తుతం అమలులో ఉన్న పద్ధతిలోనే అడంగల్, 1బీ ద్వారానే భూహద్దులు చూస్తున్నారు. రిజిస్ట్రేషన్లు కూడా చేస్తున్నారు.

328 గ్రామాల్లోనే...

జిల్లాలో 737 గ్రామాల్లో భూముల రీసర్వే చేయాలని అనుకున్నారు. ఇప్పటి వరకు నాలుగు విడతల్లో 328 గ్రామాల్లో మాత్రమే ఈ ప్రక్రియ పూర్తి చేశారు. మిగిలిన గ్రామాల్లో సర్వే జరగాల్సి ఉంది. ఎన్నికల కోడ్ అమలులోకి రావటంతో రీసర్వే ప్రక్రియ ఆగిపోయింది. పొలాల హద్దుల్లో సర్వే రాళ్లు పాతేందుకు కూడా రైతులు విముఖత వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కు 3.90 లక్షల హద్దురాళ్లురాగా వాటిలో 3.80 లక్షలు నాటారు. మిగిలినవి నాటాల్సి ఉంది. రీసర్వే అన్ని గ్రామాల్లో ఎప్పటికి పూర్తవుతుందో చెప్పలేని పరిస్థితి ఏర్పడింది.

కొన్ని ఫిర్యాదులే వచ్చాయి



భూముల రీసర్వేకు సంబంధించి 328 గ్రామాల్లో పూర్తి చేశాం. రైతులకు ముందుగా సమాచారం ఇచ్చి వారి సమక్షంలోనే సర్వే చేశాం. 4వ విడత సర్వే కూడా కొన్ని గ్రామాల్లో పూర్తి చేశాం. విస్తీర్ణంలో కొలతల తేడాకు సంబంధించి అతి తక్కువ సంఖ్యలో ఫిర్యాదులు అందాయి. వాటిని పరిశీలించి పరిష్కరిస్తున్నాం.

- హనుమాన్ ప్రసాద్, జిల్లా సర్వే శాఖ ఏడీ

చెక్‌పోస్టు వద్ద నగదు స్వాధీనం


వివరాలు తెలుపుతున్న రూరల్ డీఎస్పీ వీరాంజనేయ రెడ్డి

నెల్లూరు(క్రైం), మార్చి 26: అంతర జిల్లా సరిహద్దుల్లో ఎన్నికల చెక్‌పోస్టు వద్ద తనిఖీల్లో అక్రమంగా తరలిస్తున్న రూ.7.58 లక్షల నగదును పోలీసులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. నెల్లూరు రూరల్ డీఎస్పీ వీరాంజనేయరెడ్డి ఆయన కార్యాలయంలో విలేకర్లకు వివరాలు వెల్లడించారు. మనుబోలు మండలం బద్దెవోలు వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులో వాహన తనిఖీలు చేస్తుండగా నెల్లూరుకు చెందిన కర్తం వినోద్‌కుమార్‌రెడ్డి శ్రీకాళహస్తి నుంచి రూ. 7.58 లక్షల నగదును ఎటువంటి పత్రాలు లేకుండా కారులో తరలిస్తుండటాన్ని గుర్తించారు. నగదును స్వాధీనం చేసుకుని తదుపరి విచారణ నిమిత్తం ఆదాయపన్ను శాఖ అధికారులకు అప్పగించారు. ఎన్నికలు ముగిసేంత వరకు సరైన ఆధారాలు లేకుండా నగదును తరలిచవద్దని డీఎస్పీ ప్రజలకు సూచించారు. మద్యం అక్రమ విక్రయాలు, నిల్వ, నగదు పంపిణీ తదితరాలను ప్రజలు గుర్తిస్తే 112 నెంబరుకుగానీ, స్థానిక పోలీసులకుగానీ సమాచారం అందిస్తే తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. మీడియా సమావేశంలో మనుబోలు ఎస్ఐ జీ అజయ్‌కుమార్, చెక్‌పోస్టు సిబ్బంది షేక్ ముజీర్, మస్తాన్, మల్యాద్రి, అరుణ్ పాల్గొన్నారు.

452 పొగాకు బేళ్ల కొనుగోలు

కలిగిరి, మార్చి 26 : స్థానిక పొగాకు వేలం కేంద్రానికి మంగళవారం రైతులు 575 పొగాకు బేళ్ల విక్రయానికి తీసుకొచ్చారు. వేలంలో 12 కంపెనీల ప్రతినిధులు పాల్గొని 452 బేళ్ల కొనుగోలు చేశారు. నోసేల్-7, నో బిడ్-83, సీఆర్-17, జంపింగ్‌లాట్స్-16 కారణాలతో 123 బేళ్ల తిరస్కరణకు గురయ్యాయి. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.231, కనిష్ఠ ధర రూ.220, సగటు ధర రూ.227.76గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి మహేష్‌కుమార్ తెలిపారు.

వలంటీరుపై కేసు నమోదు

కోవూరు, మార్చి26: ఎన్నికల నియమావళిని ఉల్లఘించి వైసీపీ ప్రచారంలో పాల్గొన్న పోతిరెడ్డిపాళెం వలంటీర్ పెంచలయ్యపై సోమవారం రాత్రి పోలీసులు కేసు నమోదు చేశారు. కోవూరు వైసీపీ అభ్యర్థి నల్లపరెడ్డి ప్రసన కుమార్ రెడ్డికి ఓటేయమని కోరుతూ జడ్పీటీసీ కవరగిరి శ్రీలత, వైసీపీ నాయకులతో కలసి ప్రచారం చేస్తుండడంపై పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు ఎంపీడీవో రామాంజనేయులకు ఫిర్యాదు చేశారు. వివరాలు సేకరించిన ఎంపీడీవో పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్ఐ రంగనాథ్‌గౌడ్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

పెద్దరాముడుపాలెంలో యువకుడి హత్య

నిందితుడి ఇంటి ఆవరణలో పూడ్చివేత ● ఆలస్యంగా వెలుగులోకి..

కావలి రూరల్, మార్చి 26: ఒక యువకుడిని హత్య చేసి పూడ్చిపెట్టిన సంఘటన కావలి మండలం తుమ్మలపెంట పంచాయతీ పెద్దరాముడుపాలెంలో మంగళవారం వెలుగు చూసింది. స్థానికులు, బంధువుల సమాచారం మేరకు.. పెద్దరాముడుపాలెంకు చెందిన కాటంగారి గోపాల్(26) మంగుళూరు బోటుకు వెళ్లి 15 రోజుల క్రితం గ్రామానికి వచ్చాడు. ఈ నెల 18 రాత్రి గ్రామానికి చెందిన బుచ్చంగారి యగ్గర్, మరికొందరితో కలసి మద్యం సేవించి ఇంటికి చేరాడు. అదే రోజు రాత్రి యగ్గర్ తన పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లాలని ఒక వ్యక్తిని గోపాల్ ఇంటికి పంపాడు. అర్ధరాత్రి సమయంలో మళ్లీ ఇద్దరూ కలసి యగ్గర్ ఇంటి వద్ద మద్యం సేవించారు. గోపాల్ ఉదయం వరకు ఇంటికి రాకపోవడంతో గోపాల్ భార్య యగ్గర్ ఇంటికి వెళ్లి ప్రశ్నించగా పొలానికి వెళ్లి వచ్చామని, ఆ తరువాత ఎక్కడికి వెళ్లాడో తనకు తెలియదని చెప్పాడు. దీంతో బోటుకు వెళ్లాడేమో అనుకొని వాకబు చేయసాగారు. ఈ నేపథ్యంలో గోపాల్‌తోపాటు బోటుకు వెళ్లే గ్రామానికి చెందిన కాటంగారి క్రిష్ణ అలియాస్ పంతులుకు యగ్గర్‌పై అనుమానం రావడంతో అతని కదలికలను గమనించసాగాడు. మంగళవారం గ్రామానికి సమీపంలోని పొలాల్లో కాల్చిన మోకాలు కిందభాగం కవరులో ఉండటాన్ని ఒక మహిళ గుర్తించి గ్రామస్థులకు సమాచారం ఇచ్చింది. దీంతో యగ్గర్ తల్లిదండ్రులు ఉండే ఇంటికి సమీపంలో పరిశీలించగా బ్లీచింగ్ ఎక్కువగా చల్లి దానిపై కట్టెల మోపులు పెట్టి ఉండటాన్ని స్థానిక యువకులు గుర్తించారు. వాటిని తొలగించి అక్కడ తవ్వగా గోపాల్ లుంగీ బయటపడింది. దీంతో గ్రామస్థులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. అనుమానితుడు యగ్గర్ పరారీలో ఉన్నాడు. రూరల్ సీఐ శ్రీనివాసరావు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. గోపాల్‌కు భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

ఉపాధ్యాయులకు ఆర్థిక బకాయిలు చెల్లించాలి

నెల్లూరు (విద్య), మార్చి 26 : ఉపాధ్యాయులకు రావాల్సిన ఆర్థిక బకాయిలను ప్రభుత్వం చెల్లించాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షకార్యదర్శులు వెంకటరాజు, నాటకం తిరుమలయ్య ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం గత ఐదేళ్లలో ఉద్యోగులను అనేకసార్లు చర్చలకు పిలిచి ఏ ఒక్కసారి కూడా ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని విమర్శించారు. గత ప్రభుత్వం అందించిన 43శాతం పీఆర్సీ కంటే మెరుగైన పీఆర్సీ ఇస్తామని 23శాతమే ఇచ్చిందని, సీపీఎస్ రద్దు చేస్తానని చెప్పి మాట మార్చిందని ఆరోపించారు. జీవో నెం. 117 ద్వారా నిరుపేద దళితవాడల్లోని విద్యార్థులను పరోక్షంగా ప్రాథమిక విద్యకు దూరం చేసిందన్నారు. ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయులపై పని ఒత్తిడి పెంచడంతోపాటు రాష్ట్ర వ్యాప్తంగా వేల సంఖ్యలో ఉపాధ్యా యుల సంఖ్యను కుదించిందన్నారు. ఉపాధ్యాయులకు చెందాల్సిన రూ.31వేల కోట్ల ఆర్థిక బకాయిల్లో కనీసం రూ.16 వేల కోట్లు అయినా విడుదల చేసి ఒక్క మాటైనా నిలుపుకోవాలని డిమాండ్ చేశారు.

నోరు అదుపులో పెట్టుకో ప్రసన్నా..!

● టీడీపీ నేత కోటంరెడ్డి


కరపత్రాలను పంచుతూ మహిళతో మాట్లాడుతున్న కోటంరెడ్డి

నెల్లూరు (వ్యవసాయం), మార్చి 26 : 'నోరు అదుపులో పెట్టుకో.. లేదంటే నీ జాతకం బయటపెడతా'నంటూ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డికి హెచ్చరికలు జారీ చేశారు. నగరంలోని 11వ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో మంగళవారం ఆయన టీడీపీ నగర అభ్యర్థి పొంగూరు నారాయణను గెలిపించాలంటూ అభ్యర్థించారు. ఈ సందర్భంగా కోటంరెడ్డి మాట్లాడుతూ మహిళ అని కూడా చూడకుండా నోటికొచ్చినట్లు మాట్లాడతావా.. ఆడవాళ్లతో పెట్టుకుంటే రాజ్యాలే కూలిపోయాయని, ఒళ్లు దగ్గర పెట్టుకోవాలని సూచించారు. వైసీపీలో ఉన్నప్పుడు వేమిరెడ్డి దంపతులను పొగిడిన నువ్వు ఇప్పుడు తిట్టడం ఏమిటని ప్రశ్నించారు. ఓటమి భయంతోనే ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. ప్రశాంతిరెడ్డి ఎవరని తెలిసి కూడా ఆమెపై విమర్శలు చేయడం దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని మండిపడ్డారు. ఇంకోసారి ఇలా మాట్లాడితే బెంగుళూరు హైదరాబాదు, చెన్నైలో నువ్వు చేసిన రాసలీలలు బయటపెడతానని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నాగేంద్ర, రేఖ, దశయ్య, నాగరాజన్ తదితరులు పాల్గొన్నారు.

యువత భవితను చిదిమేస్తున్న డ్రగ్స్ మాఫియా

● తెలుగు మహిళ అధ్యక్షురాలు భూలక్ష్మి


మాట్లాడుతున్న భూలక్ష్మి

నెల్లూరు (వెంకటేశ్వరపురం), మార్చి 26 : రాష్ట్రంలో యువత భవితను జగన్ డ్రగ్స్ మాఫియా చిదిమేస్తోందని తెలుగు మహిళ నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షురాలు పనబాక భూలక్ష్మి విమర్శించారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఆమె విలేకరుల తో మాట్లాడారు. చంద్రబాబు ఆంధ్రప్రదేశ్‌ను పరిశ్రమలు, పెట్టుబడులతో నెం.1 స్థానానికి తీసుకెళితే, జగన్ డ్రగ్స్‌లో నెం.1 స్థానంలో ఉంచారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో విఫలమైన జగన్, డ్రగ్స్ సరఫరాలో మాత్రం ముందున్నా రన్నారు. మన పిల్లల భవిష్యత్తు కోసం రానున్న ఎన్నికల్లో టీడీపీ కూటమి అభ్యర్థుల్ని గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బ్రాయిలర్ లైవ్	140
లేయర్ లైవ్	73
స్కిన్ చికెన్	246
స్కిన్‌లెస్	274
లేయర్	125

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 6341
వెండి కిలో ధర	రూ. 76,700
వెండి ఒక గ్రాము	రూ. 78.70

మోటారు బైక్ బోల్తా.. వ్యక్తికి తీవ్రగాయాలు

అనంతసాగరం, మార్చి 26: సోమశిల సమీపంలో మంగళవారం ద్విచక్ర వాహనం బోల్తాపడటంతో ఒరిస్సాకు చెందిన వినయ్‌కు తలకు తీవ్ర గాయాలు అయ్యాయి. వరికోత యంత్రం వద్ద పనిచేసే ఈయన మోటారు బైక్ సైడ్ స్టాండ్ తీయకుండా సోమశిల నుంచి అనంతసాగరం వైపు వెళుతుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. సమాచారం తెలుసుకొన్న సోమశిల పోలీసులు అక్కడకు చేరుకొని గాయపడ్డ వ్యక్తిని 108 వాహనంలో ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

టెండర్లతో సరి..

రోడ్లు ఎప్పుడో మరి!

● ప్రచార ఆర్భాటాలకే పరిమితమైన పీఆర్ రోడ్ల అభివృద్ధి ● రెండేళ్లుగా ముందుకు రాని కాంట్రాక్టర్లు
● బ్యాంకు రుణం మంజూరు కాకపోవడమే కారణం ● గుంతల రోడ్లతో పల్లెవాసుల అవస్థలు

అదిగో రుణం అంటే ఇదిగో రోడ్డు అన్నారు.. గ్రామీణ రోడ్లకు మహర్దశ అని ప్రచారం చేసుకున్నారు. రూ.1100 కోట్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) నిధులతో పంచాయతీ రాజ్ రోడ్ల రూపురేఖలు మారుస్తున్నట్లు గొప్పలు చెప్పుకున్నారు.. కానీ అంతా తుస్.. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో రూ.184. 41 కోట్ల అంచనాలతో 222 రోడ్లను అభివృద్ధి చేసేందుకు 34 ప్యాకేజీలుగా విభజించారు. 2022లో ఈ వర్కులకు టెండర్లు పిలవడం మొదలు పెట్టగా రెండేళ్లు గడిచినా ఇప్పటికీ టెండర్లు పిలుస్తూనే ఉన్నారు. ఈ రెండేళ్లలో గ్రామీణ రోడ్లను బాగు చేయడం అటుంచితే కనీసం గుంతలను కూడా పూడ్చలేక పోయారు. దీంతో ప్రజలు దినదినగండంగా ఈ రోడ్లపై ప్రయాణం చేయాల్సి వస్తోంది.


కొడవలూరు : గుంతలమయంగా మిక్కిలంపేట రోడ్డు

నెల్లూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : ఏ రోడ్డు చూసినా ఏమున్నది గర్వకారణం అన్నట్లుగా మారింది గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల దుస్థితి. మరీ ముఖ్యంగా కనెక్టివిటీ రోడ్లు దారుణంగా దెబ్బతిన్నాయి. రోడ్ల మొత్తాన్ని బాగు చేయడం అటువంచితే భారీ గుంతలకూ ప్యాచ్‌లు వేయలేకపోయారు. అందులోనూ 2020, 2021లలో భారీ వర్షాలు, వరదలు సంభవించగా 2023లో మిచౌంగ్ తుఫాన్ దెబ్బకు రోడ్లు మరింత దారుణంగా మారిపోయాయి. రాళ్లు తేలిపోయి, గుంతలుగా మారిపోవడంతో ఆ రోడ్లపై ప్రయాణమంటేనే ప్రజలు హడలి పోతున్నారు. స్థానిక ప్రజాప్రతి నిధులకు ప్రజల నుంచి సెగ తగులు తుండటంతో పలుమార్లు జడ్పీ సమావే శాల్లో సభ్యులు ఈ రోడ్ల దుస్థితి గురించి ప్రస్తావించారు. కానీ ప్రయోజనం లేకుండా పోయింది. అయితే రెండేళ్ల క్రితం గ్రామీణ ప్రాంతాల్లోని ముఖ్యమైన కనెక్టివిటీ రోడ్లను ఏఎంసీ నిధులతో బాగు చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. రాష్ట్రవ్యాప్తంగా రూ.1100 కోట్లను బ్యాంకు నుంచి రుణంగా పొంది ఈ రోడ్లను అభివృద్ధి చేయనున్నట్లు స్వయంగా వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి వెల్లడించారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలోనూ రూ.184.41 కోట్ల అంచనాలతో 222 రోడ్లను అభివృద్ధి చేసేందుకు 34 ప్యాకేజీలుగా విభజించి దాదాపు రెండేళ్ల క్రితం టెండర్లు పిలిచారు. కానీ అప్పటికే బిల్లులను ప్రభుత్వం సకాలంలో చెల్లించకపోవడంతో టెండర్లు వేసేందుకు కాంట్రాక్టర్లు ఆసక్తి చూపలేదు. నాలుగు సార్లు టెండర్లు పిలిచినా కేవలం 8 ప్యాకేజీలకు మాత్రమే స్పందన వచ్చింది.

● రెండేళ్లుగా టెండర్లతో సరి

పంచాయతీరాజ్ రోడ్ల అభివృద్ధిలో మొదటి నుంచి ప్రభుత్వ నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. మొదట అంచానాలు రూపొందించే సమయంలోనే కొత్త ఎస్ఎస్ఆర్‌తో కాకుండా పాత ఎస్ఎస్ఆర్‌తో ధరలు నిర్ణయించారు. అలానే కేంద్ర ప్రభుత్వం జీఎస్టీను 12 నుంచి 18 శాతానికి పెంచినా ఈ అంచనాల్లో మాత్రం 12 శాతంగానే పేర్కొన్నారు. దీంతో తమపై భారం పడుతుందని భావించిన కాంట్రాక్టర్లు తొలుత టెండర్లు వేసేందుకు మొగ్గు చూపలేదు. అయితే ఐదు ప్యాకేజీలకు అగ్రిమెంట్ చేసినా ఆ వర్కులను కూడా అరకొరగానే చేశారు. ఆ తర్వాత ఏఎంసీ వర్కులకు బ్యాంకు రుణం మంజూరు కాలేదు. దీంతో చేసిన వారికి కూడా బిల్లులు చెల్లించే పరిస్థితి లేకుండా పోయింది. ఈ తర్వాత పలు మార్లు టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. ప్రభుత్వం హామీ ఇచ్చినా కాంట్రాక్టర్లు నమ్మకం చూపలేదు. దీంతో 2023 అక్టోబరు, నవంబరు నెలల్లో మరోసారి ఎస్ఎస్ ఆర్ ధరలు మార్చి మళ్లీ టెండర్లు పిలిచారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో ఎమ్మెల్యేలు కాంట్రాక్టర్లపై ఒత్తిడి తెచ్చి టెండర్లు వేసేలా చేశారు. కానీ ఇప్పటికీ కొందరు అగ్రిమెంట్లు చేసుకోలేదని సమాచారం. మరికొన్ని వర్కులకు టెండర్లు దాఖలు కాలేదు. దీంతో ఆ వర్కులకు ఇప్పుడు మళ్లీ టెండర్లు పిలిచారు. ఈ లోపు ఎన్నికల కోడ్ వచ్చేసింది. అదే సమయంలో ప్రభుత్వం చెప్పినట్లు బ్యాంకు రుణం కూడా మంజూరు కాలేదు. ఇలా రెండేళ్లపాటు ప్రచార ఆర్భాటం చేసుకుంటూ టెండర్లతో సరిపెట్టారు తప్ప ఒక్క రోడ్డును కూడా బాగు చేయలేక పోయారు. అయితే ఏఎంసీ వర్కులకు ఇప్పటి వరకు ఎంత మంది టెండర్లు వేశారు? ఎన్నింటికి అగ్రిమెంట్లు చేశారు? ఇంకా ఎన్ని వర్కులకు టెండర్లు ఖరారు కావాల్సి ఉంది? అసలు క్షేత్ర స్థాయి పరిస్థితులు ఏమిటి? అన్న వివరాలను పంచాయతీరాజ్ అధికారులు గోప్యంగా ఉంచుతున్నారు. అధికార వైసీపీకి చెడ్డ పేరు వస్తుందన్న కారణంతోనే వివరాలను బయటకు చెప్పేందుకు ఇష్టపడడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కాగా ఈ వర్కులపై వివరణ కోరేందుకు పంచాయతీరాజ్ ఎస్ఈ అశోక్ కుమార్‌ను సంప్రదించేందుకు ప్రయత్నించగా ఆయన అందు బాటులోకి రాలేదు.

ఆంధ్రజ్యోతి పరిశీలన


సైదాపురం : రాళ్లు తేలిపోయి గుంతలు ఏర్పడ్డ కృష్ణారెడ్డిపల్లి రోడ్డు

ప్రతి వాహనాన్ని తనిఖీ చేయండి

● ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి
● ఎన్నికల చెక్‌పోస్ట్‌ల పరిశీలన

వలేటివారిపాలెం, మార్చి 26: చెక్‌పోస్టు వద్ద ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలని జిల్లా ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి తెలిపారు. మండలంలోని మాలకొండ బార్డర్ వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ అవసరమైన ప్రతి చోట సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని కట్టుదిట్టమైన భద్రత చర్యలు చేపట్టాలని తెలిపారు. అక్రమ మద్యం, డబ్బు తరలించకుండా తనిఖీలు నిర్వహించాలని తెలిపారు. సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. శాంతిభద్రతలు పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం చెక్‌పోస్టు వద్ద రిజిస్టర్లు పరిశీలించారు. అలాగే వలేటివారిపాలెం పోలీస్‌స్టేషన్‌ను పరిశీలించారు. ఆయన వెంట కందుకూరు డీఎస్పీ శ్రీనివాస్, గుడ్లూరు సీఐ సుబ్బారావు, ఎస్‌ఐ బాలమహేంద్ర నాయక్ తదితరులు ఉన్నారు.

సరిహద్దు చెక్‌పోస్ట్‌ను పరిశీలించిన ఎస్పీ

మర్రిపాడు: మండంలోని పడమటినాయుడిపల్లి సమీపంలోని నెల్లూరు-కడప జిల్లాల సరిహద్దు వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్‌ను మంగళవారం ఎస్పీ తిరుమలేశ్వర్ రెడ్డి పరిశీ లించారు. ఇప్పటికే జిల్లాలో 400 వివిధ రకాల కేసులు, సంబంధిత పత్రాలు లేకుండా తీసుకెళ్త న్న రూ.10 కోట్ల రూపాయలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తిరుమలేశ్వర్‌రెడ్డి తెలిపారు. తనిఖీలల్లో తమిళనాడుకు చెందిన మూడు మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని కేసు నమో దు చేసినట్లు ఎస్‌ఐ విశ్వనాథ్‌రెడ్డి తెలిపారు. తనిఖీలల్లో రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.



మర్రిపాడు చెక్‌పోస్ట్ వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ

కాకర్ల సురేష్‌ను గెలిపించండి



దుత్తలూరులో ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), మార్చి 26: సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని మంగళవారం దుత్తలూరులోని బూత్ 108పరిధిలోని టీడీపీ నాయకులు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరుగుతూ టీడీపీ ప్రభుత్వం ప్రవేశ పెట్టనున్న మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. మాజీ జెడ్పీటీసీ చీదర్ల మల్లికార్జున, కాకర్ల మధుసూదన్ రెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు యనమల, సుబ్బారెడ్డి, వెంగళరావు, నవీన్, వెంకటరామిరెడ్డి, పాతర రవి పాల్గొన్నారు.

స్థలం ఆక్రమించారని ఫిర్యాదు

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), మార్చి 26: దుత్తలూరు సెంటర్‌కు సమీపంలోని 1591 సర్వే నెంబర్‌లో మాదిగల భవన నిర్మాణానికి కేటాయించిన 50సెంట్ల స్థలాన్ని కొందరు చదును చేసి ఆక్రమించి కంచె వేశారని ఎమ్మార్పీఎస్ నాయకులు మంగళవారం తహసీల్దారు యశోదను కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థలా నికి ఉత్తరం వైపున ఉన్న భూ యజమానులు వారి గట్టుపై ఉన్న కంపచెట్లు తొలగించి తాము చదును చేసిన స్థలాన్ని సైతం ఆక్రమించి కంచె వేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయమై భూ యజమానులను ప్రశ్నిస్తే తమపై దౌర్జ న్యం చేస్తున్నారని వాపోయారు. ఆ స్థలంలో పలుమార్లు ఎమ్మార్పీఎస్ సమావేశాలు, జెండా ఆవిష్కరణ సైతం చేశామని గుర్తు చేశారు. ఈ విషయంలో విచారణ చేపట్టి మాకు న్యాయం చేయాలని కోరారు. వారి వెంట ఎమ్మార్పీఎస్ నాయకులు గొల్లపల్లి శ్రీనివాసులు, గొల్లపల్లి మోహన్, గంగపట్ల సింహాద్రి, బర్రె అర్జున్, కొనినిపోగు రవి ఉన్నారు.



తహసీల్దారుకు ఫిర్యాదు చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

1వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ఉదయగిరి రూరల్, మార్చి 26: మండలంలో ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొంటున్న పిల్లలు, బీసీ, మైనార్టీ, ఓసీ వర్గాల అర్హు లైన పిల్లలు ప్రైవేటు పాఠశాలల్లో 1వ తరగతిలో ప్రవేశం పొందేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మంగళవారం ఎంఈవో-1 షేక్ మస్తాన్‌వలి తెలి పారు. విద్యాహక్కు చట్టం కింద అవకాశం కల్పించినట్లు, ఈ నెల 31లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవా లన్నారు.



మస్తాన్‌వలి, ఎంఈవో

ఆదమరిస్తే అంతే సంగతులు.. !

వరికుంటపాడు: నిత్యం ప్రజలు, వాహనదారులతో రద్దీగా ఉండే ప్రధాన రహదారుల సమీపంలో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదాలకు నిలయంగా ఉన్నాయి. ఇస్కపల్లి- జడదేవి, ఇస్కపల్లి- విరువూరు గ్రామాలకు వెళ్లే రహదారి కూడలి సమీపంలోని ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ తక్కువ ఎత్తులో ఏర్పాటు చేశారు. దీనితో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందో అని ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. అటువైపు వెళ్లిన ప్రజలతో పాటు మూగజీవాలు సైతం ఆదమరిచి ఫీజు లింకు వైర్లను తగిలితే ప్ర మాదాల బారిన పడే అవకాశం ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రమా దాలు జరుగకముందే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



తక్కువ ఎత్తులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

కృష్ణంపల్లిలో వైద్యశిబిరం

ఉదయగిరి రూరల్, మార్చి 26: ఆరోగ్యసురక్ష రెండో విడత కార్యక్రమంలో భాగంగా కృష్ణంపల్లి సచివాలయ పరిధిలో మంగళవారం మంగళవారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో వైద్యులు రోగులను పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఈశ్వరమ్మ, వైద్యాధికారిణి వినీత, ఈవోపీఆర్డీ మల్లికార్జున, ఆరోగ్య బోధకుడు వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

సువిధ పోర్టల్‌ను సద్వినియోగం చేసుకోండి

ఉదయగిరి, మార్చి 26: సార్వత్రిక ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు సువిధ పోర్టల్‌ను సద్వినియోగం చేసుకోవాలని మంగళవారం నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజా రమేష్‌ప్రేమ్‌కుమార్ తెలిపారు. వివిధ రాజకీయ పార్టీలకు చెందిన అభ్యర్థుల నామినేషన్‌లు, ప్రచార అనుమతి, నామినేషన్ల సమర్పణ, బహిరంగ సభలకు 48 గంటలకు ముందుగా ఈ పోర్టల్ ద్వారా అనుమతి తీసుకోవచ్చన్నారు. నియోజకవర్గంలో వాహనాల అనుమతికి లౌడ్ స్పీకర్లు ఏర్పాటు, మీటింగ్‌లు, ర్యాలీలు, కార్యాలయాల ఏర్పాటు, కరపత్రాల పంపిణీ, వీడియోలకు 20దరఖాస్తులు రాగా వాటిలో వివిధ కారణాలతో రెండు దరఖాస్తులు తిరస్కరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఆర్వో నెహ్రూబాబు పాల్గొన్నారు.

ఇంటింటా లార్వా సర్వే



వివరాలు సేకరిస్తున్న మలేరియా సబ్ యూనిట్ అధికారి నౌషాద్‌బాబు

దుత్తలూరు(ఉదయగిరి రూరల్): కమ్మవారిపాలెంలో డెంగ్యూ సస్పెక్టడ్ కేసు నమోదు కావడంతో మంగళవారం ఉదయగిరి మలేరియా సబ్ యూనిట్ అధికారి ఎస్‌జీ నౌషాద్‌బాబు, ఆరోగ్య పర్యవేక్షకులు ఖాజామొహిద్దీన్‌లు సిబ్బందితో కలిసి లార్వా సర్వే చేపట్టారు. 82 నివాసాలను సందర్శించి వివరాలు సేకరించారు. పరిసరాల పరిశుభ్రతకు, దోమల నివారణకు చర్యలు చేపట్టారు. ప్రజలకు వ్యాధులపై అవగాహన కల్పించి కరపత్రాలు పంపిణీ చేశారు. జిల్లా మలేరియా అధికారి ఆదేశాల మేరకు మేరకు చేపట్టిన కార్యక్రమంలో సంజీవమ్మ, భవానీ, మానస, నాగేశ్వరి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పలువురిపై మతిస్థిమితం లేని వ్యక్తి దాడి

ఉదయగిరి, మార్చి 26: స్థానిక బస్టాండ్ సెంటర్‌లో మతిస్థిమితం లేని ఓ యువకుడు మంగళవారం పలువురిపై దాడి చేశాడు. స్థానిక యు వకులు ఆ వ్యక్తిని గుర్తించి బస్టాండ్ సెంటర్‌లో నిలదీయడానికి ప్రయత్నించారు. అప్పటికే ఆ యువ కుడు శరీరంపై నూలు పోగు లేకుండా హల్‌చల్ చేస్తున్నాడు. పసిగట్టిన మహిళలు పరుగులు తీయడంతో వారించేందుకు యత్నించిన పలువు రిపై దాడికి దిగడమే కాకుండా పలు దుకాణాల్లో వస్తువులను విధ్వంసం చేశాడు. యువకులు చాకచక్యంతో అతన్ని బంధించి కుటుంబసభ్యులకు అప్పజెప్పారు. బస్టాండ్ సెంటర్‌లో జరిగిన ఈ ఘటనతో పలువురు బేంబెలెత్తి పరుగులు తీశారు.



కుటుంబ సభ్యులకు అప్పగించిన యువకులు

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

ఉదయగిరి, మార్చి 26: స్థానిక అరుంధతీయవాడకు చెందిన నిరుపేద పొదిలి తిరుపాలు మంగళవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఏపీ ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ అధ్యక్షుడు నల్లిపోగు ప్రసాద్ గ్రామానికి వెళ్లి కుటుంబసభ్యులకు నగదును అందజేశాడు. కుటుంబానికి అండగా ఉంటామని, ప్రభుత్వ పథాలను అందేలా చూస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు గడ్డం బాబు, నాగిళ్ల మహేష్, యర్రగుంట్ల బాబు పాల్గొన్నారు.

గురుకులానికి లింగంగుంట విద్యార్థుల ఎంపిక

అనంతసాగరం, మార్చి 26: లింగంగుంట ఎస్సీ ప్రాథమిక పాఠశాల నుంచి 6గురు విద్యార్థులు గురుకుల పాఠశాలలకు ఎంపికైనట్లు మంగళవారం హెచ్‌ఎం అల్లా బక్షు తెలిపారు. ఈ నెల 10న జరిగిన ప్రతిభా పరీక్షలో ఎం.ప్రణవి (ఆదురుపల్లి), ఎస్.శ్రావ్య, ఎన్.సాహితి (సంగం),కే.హేమచంద్ర (చిల్లకూరు), వినయ్ (నాయుడుపేట), మెనీష్ (కోట) గురుకుల పాఠశాలలో ఐదవ తరగతికి ఎంపికైనట్లు చెప్పారు.



మెరుగైన సేవలందించండి

ఏఎస్ పేట, మార్చి 26: గ్రామీణ ప్రజలకు మెరుగైన సేవలందించాలని జిల్లా వైద్యాధికారి ఎం.పెం చలయ్య తెలిపారు. మంగళవారం ఆయన శ్రీకొలనులో నిర్వహిస్తున్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వైద్యులు, సిబ్బందికి తగిన సలహాలు. సూచనలు ఇచ్చారు.

గ్రామాల్లో విజయ సంకల్పయాత్ర

సీతారామపురం, మార్చి 26: నెమళ్ళదిన్నె, జయపురం, దేవిశెట్టిపల్లిలో మంగళవారం నియోజకవర్గ వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి విజయ సంకల్పయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో మేకపాటి అభినవరెడ్డి, చింతంరెడ్డి సుబ్బారెడ్డి ,ఎంపీపీ చింతం రెడ్డి పద్మావతి, బాలినేని మాబయ్య, అయ్యవారిపల్లి సర్పంచ్ దుగ్గయ్యకాశయ్యసీతారామపురం ఎంపీటీసీ పొలగిరి అల్లూరురాజు, మాజీ సొసైటీ అధ్యక్షులు రమణయ్య పాల్గొన్నారు. అనంతరం సీతారామపురంలో ఏర్పాటు చేసిన పార్టీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు.

ఉదయగిరిలో కోడ్ ఉల్లంఘన

ఉదయగిరి, మార్చి 26: సార్వత్రిక ఎన్నికల కోడ్ పదిరోజులు కిందట అమల్లోకి వచ్చింది. ఈ కోడ్‌ను ఉదయగిరిలో అమల్లోకి తీసురావడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలోని శిలాఫలకంపై వివిధ రాజకీయ పార్టీల నాయకుల పేర్లు ఉన్నా అధికారులు పట్టించుకోలేదు. అలాగే ఉదయగిరి-1 సచివాలయంలోని రైతుభరోసా కేంద్రానికి వైసీపీ రంగులను అధికారులు చూసీచూడనట్లు వెళుతున్నారు.

కావలి
కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

అవినీతి పరులెవరో తేల్చుకుందామా?

● రక్త చరిత్రతో రాజకీయాల్లోకి వచ్చిన ప్రతాప్ : కావ్య

కావలి, మార్చి 26: నియోజకవర్గంలో ఎవరు అవినీతిపరులో తేల్చుకునేందుకు సిద్ధమా అని ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డిని టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి ప్రశ్నించారు. స్థానిక ముసునూరులోని టీడీపీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అవినీతి, అక్రమాలు, రక్త చరిత్రతో రాజకీయాల్లోకి వచ్చిన వ్యక్తి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి అని ఆరోపించారు. వచ్చే ఎన్నికలు పూర్తయిన తర్వాత ఆయన అవినీతి, అక్రమాలు, దందాలపై అన్నికరాల విచారణలు జరిపితే ప్రతాప్ చరిత్ర ఏమిటో ప్రజలకు తెలుస్తోందన్నారు. ప్రజా కోర్టులో నీ చరిత్రకు చరమగీతం పాడేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని మండిపడ్డారు. కావలిలో ఎమ్మెల్యే, ఆయన అనుచరులు సుమారు రూ.600 కోట్ల విలువ చేసే 123 ఎకరాలు ప్రభుత్వ భూమిని ఆక్రమించారని దాని సంగతి త్వరలో బయటకు తీస్తానన్నారు. తాను కొనుగోలు చేసిన భూమికి మధ్యవర్తిత్వం చేసింది ఎమ్మెల్యే కాగా దానిని విక్రయించింది ఎమ్మెల్యే అనుచరులేనని, దానిలో ప్రభుత్వ భూమి ఉంటే సర్వేచేసి తీసుకోవచ్చన్నారు. వైజాగ్‌లో పుట్టిన గంజాయి కావలికి ఎలా వస్తుంది, బ్రెజిల్ నుంచి వచ్చిన మారకద్రవ్యాలు, కావలిలో మహిళల మిస్సింగ్‌లు, హత్యలు అన్నీ బయటకు తీసి తగిన గుణపాఠం చెబుతామన్నారు. ఎన్నికల అఫిడవిట్‌లో 7 కేసులు ఉన్నట్లు పేర్కొని, నాపై ఎలాంటి కేసులు లేవనడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నేతలు గుత్తికొండ క్రిషోర్, జ్యోతి బాబూరావు, కండ్లగుంట మధుబాబునాయుడు, ఆవుల రామకృష్ణ, బొట్లగుంట శ్రీహరినాయుడు, దేవకుమార్, శ్రీదర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కావ్య క్రిష్ణారెడ్డి

మండలంలో వంటేరు ప్రచారం



మాజీ ఎమ్మెల్యే వంటేరును సన్మానిస్తున్న చేవూరి

జలదంకి, మార్చి 26: కావలి మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్‌రెడ్డి మంగళవారం జలదంకి మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఉదయగిరి ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్‌లకు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. జలదంకిలో దగుమాటి మనోహర్‌రెడ్డి ఇంటికి వెళ్లి యోగక్షేమాలు అడిగి తెలుసుకుని పార్టీ విజయానికి కృషి చేయాలని కోరారు. సోమవరప్పాడులో పార్టీ నేత చేవూరి జనార్దన్‌రెడ్డి ఇంటికి వెళ్లి కార్యకర్తలు, నాయకులతో చర్చించారు. కోదండరామాపురం, చినక్రాకలో ప్రచారం చేశారు. ఆయన వెంట ఏఎంపీ మాజీ చైర్మన్ ఎంపీ రామిరెడ్డి, మాజీ జడ్పీటీసీ వంటేరు జయచంద్రారెడ్డి, బ్రాహ్మణక్రాక సర్పంచు ఇండ్ల సుధాకర్, మాజీ సర్పంచు మద్దూరి శ్రీనివాసులరెడ్డి తదితరులు ఉన్నారు.

టీడీపీ నేతలకు పరామర్శ

కందుకూరు, మార్చి 26: నియోజకవర్గంలోని పలువురు టీడీపీ నేతలను ఆపార్టీ నెల్లూరు పార్లమెంటు ఉపాధ్యక్షుడు ఇంటూరి రాజేష్ మంగళవారం పరామర్శించారు. అనారోగ్యంగా చికిత్స పొందుతున్న పలువురిని కలిసి పరామర్శించిన రాజేష్, గుడ్లూరు, మోచర్ల, తెట్టు గ్రామాల లో స్థానిక పార్టీ నాయకులతో సమావేశమై పార్టీ పరిస్థితులపై చర్చించారు. పట్టణంలోని 15వ వార్డులో అనారోగ్యంతో బాధపడుతున్న బల్లి శ్రీకాంత్‌ను పరామర్శించి మెరుగైన వైద్యం చేయించాలని, తాను అండగా ఉంటానని కుటుంబసభ్యులకు హామీ ఇచ్చారు. గుడ్లూరు గ్రామపార్టీ మాజీ అధ్యక్షుడు కోకా చిరంజీవిని పరామర్శించి ఆరోగ్య పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు.

ఇండియా కూటమితోనే దేశ భవిష్యత్

● సీపీఎం నేత మాదాల వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న సీపీఎం నేత వెంకటేశ్వర్లు

కావలిటౌన్, మార్చి 26: ఇండియా కూటమితోనే దేశ భవిష్యత్ ముడిపడి ఉందని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మాదాల వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో సీపీఎం పట్టణ ఉపాధ్యక్షుడు మధుసూదన్‌రావు అధ్యక్షతన జరిగిన జనరల్ బాడీ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మాదాల మాట్లాడుతూ ప్రస్తుత దేశ రాజకీయ పరిస్థితుల దృష్ట్యా ఇండియా కూటమి ఒక్కటే దేశానికి రక్షణ కల్పించగలదన్నారు. ప్రధాని మోదీ పాలన అవినీతిమయంగా మారిందన్నారు. ఎలక్ట్రానిక్ బాండ్ల ద్వారా లక్షల కోట్లు అవినీతి జరిగిందన్నారు. బీజేపీ పెట్టుబడిదారుల నుంచి వేల కోట్లు దోచుకుంటుందని, అవినీతిని ప్రశ్నించినవారిపై అక్రమ కేసులు పెడుతూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో నేతలు పెంచలయ్య, తిరుపాల్, కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ యువజన సంఘం కమిటీ ఎంపిక

ఉలవపాడు, మార్చి 26 : మండలంలోని చాకిచర్ల శ్రీశ్రీనగర్ ఎస్సీ కాలనీ అంబేద్కర్ యువజన సంఘం నూతన కమిటీని మంగళవారం ఎన్నుకున్నట్లు అధ్యక్షుడు సుదర్శి భాస్కరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కమిటీ ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి వేడుకలు జరుగుతాయని చెప్పారు. కమిటీ అధ్యక్ష, కార్యదర్శులుగా సుదర్శి భాస్కరరావు, సుదర్శి బాలకోటయ్య, ప్రధాన కార్యదర్శి ధన్యాసి మణిరాజ్, కోశాధికారి దాసరి సతీష్, సహాయ కార్యదర్శి సుదర్శి నాగేంద్రబాబు, గౌరవ అధ్యక్షుడు ధన్యాసి శ్రీహరి, జూటూరి సుబ్బారావులతోపాటు మరో 7 మంది ఎగ్జిక్యూటివ్ మెంబర్లను ఎన్నుకున్నట్లు తెలిపారు.

కుక్కల దాడిలో ఆరు గొర్రె పిల్లల మృతి

● మరికొన్నింటికి తీవ్ర గాయాలు



కుక్కల దాడిలో మృతి చెందిన గొర్రె పిల్లలు

లింగసముద్రం, మార్చి 26 : మండలంలోని వెంగళాపురంలో కుక్కల దాడిలో గొర్రె పిల్లలు మృతి చెందాయి. మంగళవారం మధ్యాహ్నం గ్రామానికి చెందిన గువ్వల వెంకటేశ్వర్లుకు చెందిన గొర్రెల దొడ్డిపై కుక్కలు దాడి చేసి 6 గొర్రె పిల్లలను చంపివేశాయి. మరో 6 గొర్రె పిల్లలను తీవ్రంగా కొరికి గాయపరిచాయి. వాటి పరిస్థితి కూడా విషమంగా ఉన్నట్లు బాధితుడు చెప్పారు. ఈ గొర్రెల దొడ్డి ఇంటికి దూరంగా ఉండడంతో కుక్కల దాడిని గమనించలేకపోయారు. సాయంత్రం 4 గంటల సమయంలో వెంకటేశ్వర్లు భార్య రమణమ్మ వెళ్లగా గొర్రె పిల్లలు చనిపోయి ఉండడం గమనించి భర్తకు చెప్పడంతో ఆయన వచ్చి చూసి, విషయాన్ని పశుసంవర్థక శాఖ అధికారులకు తెలియజేశారు. ఈ సంఘటనతో సుమారు రూ.60 వేల నష్టం వచ్చినట్టు ఆయన తెలిపారు.

5వ వార్డులో పలువురు టీడీపీలో చేరిక

కందుకూరు, మార్చి 26: పట్టణంలోని 5వ వార్డు బృందావనం ప్రాంతానికి చెందిన పలు బీసీ, ఎస్సీ కుటుంబాలవారు మంగళవారం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు సమక్షంలో వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వారికికీ ఆయన పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ దుర్మార్గాలను వ్యతిరేకిస్తూ టీడీపీలో చేరటం సంతోషంగా ఉందని, ప్రతి ఒక్కరూ పార్టీ గెలుపునకు శక్తివంచన లేకుండా పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు దామా మల్లేశ్వరరావు, పిడికిటి వెంకటేశ్వర్లు, చిలకపాటి మధు, దాసరి ప్రమోద్, గేరా నరేష్, కోటేశ్వరరావు, భానుచంద్రరావు, జంగాల రాఘవ తదితరులు పాల్గొన్నారు.



టీడీపీలో చేరినవారికి కండువా వేస్తున్న ఇంటూరి

ఆటోను ఢీకొన్న ట్రాక్టరు : మహిళ మృతి

● మరో ఇద్దరికి గాయాలు

కందుకూరు, మార్చి 26: మండలంలోని పెదమోపాడు గ్రామ సమీపంలో మంగళవారం ఉదయం వ్యవసాయ పనులకు కూలీలను తీసుకుని వెళ్తున్న ఆటోను వెనుక నుంచి వస్తున్న పొగాకు చెక్కుల లోడు ట్రాక్టరు ఢీకొనడంతో ఓ మహిళ మృతి చెందగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. పొగాకు చెక్కులను తీసుకుని కందుకూరులోని వేలం కేంద్రానికి వస్తున్న ట్రాక్టరు ఆటోను ఢీకొని ఆగకుండా వెళ్లింది. ఈ ఘటనలో కందుకూరు పట్టణంలోని శ్రీరామ్‌నగర్ కాలనీకి చెందిన డాలు లక్ష్మమ్మ(55) అక్కడికక్కడే మృతిచెందగా అదే కాలనీకి చెందిన బూసి లక్ష్మమ్మ, ఉమామహేశ్వరిలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం కందుకూరు ఏరియా వైద్యశాలకు తరలించారు. ప్రమాదానికి కారణమైన ట్రాక్టరును గుర్తించిన కందుకూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టీడీపీ గెలుపుతోనే సామాజిక న్యాయం

అల్లూరు, మార్చి 26 : టీడీపీ గెలుపుతోనే పేదలకు సామాజిక న్యాయం సాధ్యపడుతుందని నెల్లూరు పార్లమెంటు ఉపాధ్యక్షుడు బీద గిరిధర్ పేర్కొన్నారు. అల్లూరు పట్టణంలోని 8, 9 వార్డులతో పాటు యర్రపుగుంట, బూదురుగుంట, సింగారెడ్డిదిన్నె, ఉద్దీపగుంట, పేరంటాలమ్మతోపు, గిరిజన కాలనీల్లో మంగళవారం ఆయన ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కావలి నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కావ్య కృష్ణారెడ్డి, నెల్లూరు పార్లమెంటు అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిలను అత్యధిక మెజార్టీలతో గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో పలగాటి శ్రీనివాసులు రెడ్డి, కృష్ణచైతన్య, అరగల రమణయ్య, బండి శ్రీనివాసులు రెడ్డి, నీలపరెడ్డి హరీష్‌రెడ్డి, మేడా కృష్ణారెడ్డి, మేడా శ్రీనివాసులు రెడ్డి, నజీర్‌బాషా, అనూరాధ, తదితరులు పాల్గొన్నారు.



ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న బీద గిరిధర్

విష్ణువర్ధన్‌రెడ్డి ఇంటింటా ప్రచారం

స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయనున్న తనను గెలిపించాలని కోరుతూ మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి మంగళవారం పల్లిపాడు, కొండాయగుంట, అల్లిమడుగు తదితర ప్రాంతాల్లో ఆయన సతీమణి శివప్రియతో కలసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అనంతరాజు బాలకృష్ణంరాజు, యరటపల్లి శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

మన ఓటు మనమే వేసుకుందాం

మన ఓటు మనమే వేసుకొని పేదరికాన్ని నిర్మూలించేందుకు పాటుపడుదామంటూ స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయనున్న ఎల్లు సాల్మన్‌రాజు మండలంలోని గ్రద్దగుంట, అల్లూరు పట్టణంలోని చెర్లోసంఘం, బోడిసత్రం గిరిజన కాలనీల్లో ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కోవూరు బాబు, నక్కా గిరి, కప్పల నవీన్ కుమార్, కాకాని రంగయ్య, ఎల్లు సుబ్రహ్మణ్యం, కాలగంధం కిరణ్‌కుమార్, పోట్లూరు నాగేంద్ర పాల్గొన్నారు.

మలిశెట్టికి మాతృవియోగం

కావలి, మార్చి 26: టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, కావలి ఏఎంసీ మాజీ చైర్మన్ మలిశెట్టి వెంకటేశ్వర్లు తల్లి మలిశెట్టి ఈశ్వరమ్మ(75) మంగళవారం ఉదయం మృతి చెందారు. విషయం తెలుసుకున్న పలువురు నేతలు, పట్టణ ప్రముఖులు జనతాపేటలోని మలిశెట్టి నివాసానికి చేరుకుని ఆమె పార్థివదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. మలిశెట్టి వెంకటేశ్వర్లును పరామర్శించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాడ సానుభూతిని తెలిపారు. సాయంత్ర అంత్యక్రియలు వరకు టీడీపీ. జనసేన, బీజేపీ తదితర పార్టీల నేతల పరామర్శలు కొనసాగాయి. టీడీపీ అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి అంతిమయాత్రలో పాల్గొని శ్మశానం వరకు నడిచారు. నివాళులు అర్పించి పరామర్శించిన వారిలో మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్ రెడ్డి, టీడీపీ నాయకుడు మాలేపాటి సుబ్బానాయుడు, పీఎస్సార్ ట్రస్ట్ చైర్మన్ పసుపులేటి సుధాకర్, తదితరులు ఉన్నారు.



ఈశ్వరమ్మకు నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

అర్చకులపై వైసీపీ నేత దాడి గర్హనీయం

కందుకూరు, మార్చి 26: కాకినాడ నగరంలోని పెద్ద శివాలయంలో ఇద్దరు అర్చకులపై వైసీపీ నాయకుడు దాడి చేసి కాలితో తన్ని కొట్టడం గర్హనీయమని స్కందపురి బ్రాహ్మణ సేవాసమితి అధ్యక్షుడు ఇప్పగుంట వెంకటనాగరాజారావు, సంఘం కార్యవర్గసభ్యులు మంగళవారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. వైసీపీ నేత దాడి చాలా దారుణమైన సంఘటన అని, ఇదివరకు గుడులపై దాడి చేసిన వారు ఇప్పుడు గుడిలో ఉన్న అర్చకులపైనే దాడులకు బరితెగించటం, కాలితో తన్నడం చూస్తుంటే రాష్ట్రంలో పరిస్థితులు ఎంత దయనీయంగా మారి ఉన్నాయో అర్థమవుతోందని పేర్కొన్నారు. అర్చకులు, పురోహితుల జోలికొస్తే రాష్ట్రవ్యాప్తంగా దేవాలయాలకు తాళాలు వేసుకుని అక్కడే నిరసన కార్యక్రమాలకు పూనుకుంటామని, అవసరమైతే ప్రతిదాడులకు కూడా సిద్ధపడతామని హెచ్చరించారు. భవిష్యత్‌లో మరెక్కడా ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండే రీతిలో వైసీపీ నేతను శిక్షించాలని డిమాండ్ చేశారు.

స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలి

వలేటివారిపాలెం, మార్చి 26 : ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవా లని స్థానిక ఎస్‌ఐ బాలమహేంద్రనాయక్ తెలిపారు. వలేటివారిపాలెంలో మంగళవారం సీఆర్‌పీఎఫ్ బలగాలతో కలిసి కవాతు నిర్వహించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలలో ఓటర్లలో భయాందోళనకు తావులేకుండా చేయడానికే కవాతు నిర్వహించినట్లు తెలిపారు. సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారిస్తునట్లు తెలిపారు.



కవాతు చేస్తున్న సీఆర్‌పీఎఫ్ బలగాలు

1 నుంచి దత్తాత్రేయస్వామి మాలాధారణ దీక్ష

లింగసముద్రం : మండలంలోని మొగిలిచెర్ల సమీపంలో ఉన్న దత్తాత్రేయస్వామి మాలాధారణ మండల దీక్ష ఏప్రిల్ 1, 2, 3 తేదీలలో ప్రారంభమవుతుందని ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త పవని నాగేంద్ర ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. అర్ధ మండల దీక్ష 21, 22 తేదీలలో ప్రారంభమవుతుందని, దీక్ష తీసుకున్న భక్తులకు ప్రతి రోజూ ఆలయం వద్ద భోజన వసతి కల్పిస్తామని పేర్కొన్నారు.

వచ్చే ఎన్నికల్లో సోమిరెడ్డిని ఆశీర్వదించండి : టీడీపీ



పొదలకూరు : కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు



టీపీగూడూరు : సోమిరెడ్డికి కేక్ తినిపిస్తున్న టీడీపీ నేతలు

పొదలకూరు, మార్చి 26: మెట్ట ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసిన టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని రాబోవు ఎన్నికల్లో ప్రజలంతా ఆశీర్వదించాలని ఆపార్టీ మండల అధ్యక్షుడు తలచీరు మస్తాన్‌బాబు, పట్టణ అధ్యక్షుడు బొద్దులూరి మల్లికార్జున్‌నాయుడు అన్నారు. మంగళవారం టీడీపీ కార్యాలయంలో కేక్ కట్ చేసి సోమిరెడ్డి జన్మదిన వేడుకలను నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో 1994లో ఫలితాలే పునరావృతం అవుతాయన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బక్కయ్యనాయుడు, కలిచేటి ప్రభాకర్‌రెడ్డి, అక్కెం సుధాకర్‌రెడ్డి, పులిపాటి వెంకటరత్నంనాయుడు, జమీర్‌బాషా, ఆదాల సుగుణమ్మ, అమర్తలూరు చెంచయ్య పాల్గొన్నారు.

తోటపల్లిగూడూరు : మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు మంగళవారం వేదాయపాలెంలోని ఆయన స్వగృహంలో ఘనంగా జరిగాయి. తోటపల్లిగూడూరు టీడీపీ మండల అధ్యక్షుడు సన్నారెడ్డి సురేష్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీ కేక్ కట్ చేసి, సోమిరెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నరుకూరు ఎంపీటీసీ కొణతం రఘుబాబు, పార్టీ నాయకులు బొమ్మి సురేంద్ర, సోమిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, కోడూరు శ్రీనివాసులురెడ్డి, రమణారెడ్డి, నెల్లిపూడి సుధాకర్, ఇంగిలాల చైతన్యకుమార్‌తోపాటు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మనుబోలు : వచ్చే ఎన్నికల్లో సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తప్పక విజయం సాధించనున్నారని మండల బీజేపీ అధ్యక్షుడు పెనమల్లి వెంకటకృష్ణారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం చంద్రమోహన్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా మండల బీజేపీ నాయకులు అల్లీపురంలోని సోమిరెడ్డి నివాసంలో ఆయన్ను కలిశారు. శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందచేసి, పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు ఆరుమూళ్ళ మురళి, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు. అలాగే మనుబోలు మండలంలోని కొమ్మలపూడిలో మంగళవారం రాత్రి మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. గ్రామ టీడీపీ నాయకులు మన్నెమాల భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీ కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు గాలి రామకృష్ణారెడ్డి, నాయకులు పొన్నూరు రామకృష్ణయ్య, మన్నెమాల శ్రీనివాసులురెడ్డి, పెంచలరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, ఉమామహేశ్వర్‌రెడ్డి, మన్నెమాల ఆదినారాయణరెడ్డి, నువ్వూరు సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వెంకటాచలం : మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను మంగళవారం టీడీపీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయంలో కేక్‌ను కట్ చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు గుమ్మడి రాజాయాదవ్, జిల్లా ఉపాధ్యక్షుడు మామిళ్లపల్లి శ్రీనివాసులునాయుడు, తెలుగు మహిళ మండలాధ్యక్షురాలు దువ్వూరు లక్ష్మమ్మ, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఆదరించండి.. అందుబాటులో ఉంటాం : వీపీఆర్ దంపతులు



బుచ్చి బహిరంగ సభలో పాల్గొన్న వీపీఆర్ దంపతులు, మాజీ మంత్రులు పొంగూరు నారాయణ. ఆనం రామనారాయణరెడ్డి తదితరులు

బుచ్చిరెడ్డిపాళెం, మార్చి 26: కోవూరు టీడీపీ ఎమ్మెల్యేగా, నెల్లూరు ఎంపీగా జనసేన, బీజేపీ, టీడీపీ ఉమ్మడి అభ్యర్థులుగా మమ్మల్ని గెలిపించండి.. అందరికీ అందుబాటులో ఉండి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకుందామని వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి తెలిపారు. బుచ్చి టోల్‌గేట్ వద్ద ఓ లేవుట్‌లో మంగళవారం రాత్రి రేబాలకు చెందిన భువనేశ్వరం మురళి, గుత్తా శ్రీనివాసులు, బెల్లంకొండ లక్ష్మయ్య, నాగమాంబాపురం గ్రామానికి కత్తి మహేష్, చోళం వెంకయ్య ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభ నిర్వహించారు. ఈ సభలో వైసీపీ, కాంగ్రెస్‌ల నుంచి సుమారు 100 కుటుంబాల వారు టీడీపీలో చేరారు. వీరందరికీ వేమిరెడ్డి దంపతులతోపాటు మాజీ మంత్రులు పొంగూరు నారాయణ, ఆనం రామనారాయణరెడ్డి, కోవూరు టీడీపీ ఇన్‌చార్జి పోలంరెడ్డి దినేష్‌రెడ్డి, టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ముందుగా 1000 బైక్‌లు, 100కుపైగా ఆటోలు, కార్లతో రేబాల నుంచి ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో పాల్గొన్న ఎర్రంరెడ్డి గోవర్దన్‌రెడ్డి, ఏటూరి శివరామకృష్ణారెడ్డి, సూరా శ్రీనివాసులురెడ్డి, పుట్టా సుబ్రహ్మణ్యంనాయుడు, రేబాల గ్రామ ప్రజలు వీపీఆర్ దంపతులకు ఘన స్వాగతం పలికారు. రేబాలలో ఆంజనేయస్వామికి పూజలు నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో పొంగూరు నారాయణ, రామనారాయణరెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, జనసేన, బీజేపీ నాయకులు మాట్లాడుతూ వేమిరెడ్డి దంపతులు జిల్లాతోపాటు రాష్ట్రవ్యాప్తంగా ప్రజలకు, ఆలయాలకు, అందిస్తున్న సేవలు, వారి దాతృత్వం మరువలేనిదని కొనియాడారు. కోవూరు ఎమ్మెల్యే ప్రసన్న వారిపై చేసిన దుర్మార్గమైన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

● వారి జోలికి వస్తే బాగుండదు..

'వీపీఆర్ దంపతుల జోలికొస్తే ఇక బాగుండదు.. నీవల్ల ఎన్ని కుటుంబాలు నాశనమయ్యాయో మాకు తెలుసు. వాళ్లతో వద్దు... ఎక్కడికి రమ్మంటావో చెప్పు... నేనే వస్తా తేల్చుకుందాం... మర్యాదగా నీ రాజకీయాలు నువ్వు చేసుకో - వారి రాజకీయాలు వారుచేసుకుంటారు.. గెలుపు, ఓటమిలు ప్రజలు నిర్ణయిస్తారు. ఈసారి వాళ్ల జోలికొస్తే బాగుండదు.' అని ఎర్రంరెడ్డి గోవర్ధన్‌రెడ్డి ప్రసన్నను హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో టీడీపీ. జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● కలసికట్టుగా టీడీపీని గెలిపించుకుందాం..

ఎలాంటి వర్గ విభేదాలు, పాత,కొత్త తేడాలు లేకుండా మనమంతా కలసి టీడీపీని గెలిపించుకుని, చంద్రబాబును సీఎంగా చేసుకోవాలని వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దంపతులు పిలుపునిచ్చారు. రేబాలలో బుచ్చి బ్యాంకు మాజీ అధ్యక్షుడు ఏటూరి శివరామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో రేబాల, నాగమాంబాపురం గ్రామాల నుంచి టీడీపీలో చేరిన 50 కుటుంబాలవారికి వీపీఆర్ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ నెల్లూరు ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని, కోవూరు ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని కోరారు.కార్యక్రమంలో టీడీపీ నేతలు సూరా శ్రీనివాసులురెడ్డి, ఎంపీ.శేషయ్య, బత్తల హరికృష్ణ, రాఘవరెడ్డి, చింతం శ్రీనివాసులురెడ్డి, రంగనాథం పాల్గొన్నారు.



బుచ్చిలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తల ర్యాలీ

వైసీపీకి కైలాసం దంపతుల రాజీనామా

ఇందుకూరుపేట, మార్చి 26 : మండలంలోని కొత్తూరు ఎంపీటీసీ సభ్యురాలు, వైఎస్ ఎంపీపీ కైలాసం లావణ్య, ఆమెభర్త, కోవూరు వైసీపీ సోషల్ మీడియా కో-కన్వీనర్ శ్రీనివాసులురెడ్డి మంగళవారం వైసీపీకి రాజీనామా చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ మండలంలోని ఓ దశమగ్రహం వల్ల వైసీపీని వీడుతున్నట్లు ఆయన తెలిపారు. త్వరలో బీజేపీలో చేరుతున్నట్లు ఆయన ప్రకటించారు. కార్యక్రమంలో మేనాటి రాంబాబు, నెల్లూరు వెంకటశేషయ్య, వాకాటి శేషయ్య, పత్తిపాటి శరత్, వాకాటి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

కోవూరు షుగర్స్ బకాయిలు చెల్లించండి : సీఐటీయూ

కోవూరు, మార్చి26: కోవూరు సహకార చక్కెర కర్మాగారం ఉద్యోగులకు,కార్మికులకు చెల్లించాల్సిన వేతన బకాయిలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా నాయకుడు గోనె దయాకరరావు డిమాండు చేశారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు షుగర్ ఫ్యాక్టరీ ఉద్యోగుల జీతభత్యాల చెల్లింపు విషయంలో శ్రద్ధ తీసుకోవాలన్నారు. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల ప్రచారానికి వచ్చే నాయకులను వేతనాల విషయమై కార్మికుల కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు నిలదీయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు చల్లకొలుసు మల్లికార్జున, పోతంశెట్టి శ్రీనివాసులు, కోడిరెక్కల చెన్నయ్య, స్వర్ణ మునుస్వామి తదితరులు మాట్లాడారు.

కార్యకర్తలకు అండగా నిలుస్తాం : రాజగోపాల్

మనుబోలు, మార్చి 26: టీడీపీలోని ప్రతి చిన్న కార్యకర్తకు అండగా నిలుస్తామని సర్వేపల్లి నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని కొండుపాళెంలో టీడీపీ కార్యకర్తలైన శేషం రాగమ్మ, తాళ్ళూరు రమణమ్మ కుటుంబ సభ్యులను మంగళవారం ఆయన పరామర్శించారు. పార్టీ అండగా ఉంటుందని వారికి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు గాలి రామకృష్ణారెడ్డి, నాయకులు రఘురామయ్య, బొనిగి రవి, యానాదినాయుడు, రామ కృష్ణ, పొట్టేళ్ల ప్రసాద్, కూకర్ల మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ అభ్యర్థుల ప్రచారం

తోటపల్లిగూడూరు, మార్చి 26 : మండలంలోని చింతోపు, ముంగలదొరువు, సౌత్‌ఆములూరు గ్రామాల్లో మంగళవారం మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, తిరుపతి ఎంపీ మద్దెల గురుమూర్తి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో తమను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో శంక రయ్యగౌడ్, స్వర్ణలత, శేషమ్మ, తలమంచి సురేంద్రబాబు, సుబ్రహ్మణ్యంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు సిటీ, రూరల్
కోవూరు, సర్వేపల్లి



కవాతు చేస్తున్న పోలీసులు

ఓటు హక్కును ధైర్యంగా ఉపయోగించుకోండి

నెల్లూరు(క్రైం), మార్చి 26: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు ధైర్యంగా వారి ఓటు హక్కును వినియోగించుకోవాలని వేదాయపాళెం పోలీసు స్టేషన్ ఇన్‌స్పెక్టర్ వీవీ నారాయణ పిలుపునిచ్చారు. ఆ స్టేషన్ పరిధిలో ఓటర్లకు భరోసా కల్పించేందుకు బుజబుజ నెల్లూరు, శాంతినగర్, వేదాయపాళెం తదితర ప్రాంతాల్లో మంగళవారం బీఎస్ఎఫ్ బలగాలతో కలిసి స్థానిక పోలీసులు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ మద్యం అక్రమ నిల్వలు, పంపిణీ తదితరాలను గుర్తిస్తే డయల్ 112కుగానీ, పోలీసు స్టేషన్‌కుగానీ సమాచారం అందించాలని ప్రజలను కోరారు.

పశువు కనిపిస్తే పట్టుకెళ్తాం.. చెత్తవేస్తే జరిమానా విధిస్తాం!

● ఎంహెచ్‌వో వెంకట రమణయ్య



డ్రైనేజీ కాలువలో పూడికతీతను పరిశీలిస్తున్న ఎంహెచ్‌వో

నెల్లూరు (సిటీ), మార్చి 26 : నగరం లోని రోడ్లపై ఎక్కడైనా పశువులు కనిపిస్తే వాటిని తీసుకెళ్లి పోయి కల్లూరు పల్లిలోని గోశాలలో ఉంచుతామని మున్సిపల్ ఆరోగ్య అధికారి వెంకట రమణయ్య పశువుల యజమానులను హెచ్చరించారు. పారి శుధ్య ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా నగరంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. నగరంలో పశువుల సంచారం నిషేధమన్నారు. పారిశుధ్య పర్యవేక్షణలో భాగంగా ప్రధాన కూడళ్లు, రహదారుల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఎవరైనా రోడ్లపై వేస్తే వారిని గుర్తించి జరిమానా విధిస్తామని తెలిపారు. స్వచ్ఛమైన నెల్లూరుకు ప్రజలు సహకరించాలని కోరారు.

సోమిరెడ్డికి బద్దేపూడి సత్కారం



సోమిరెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న బద్దేపూడి తదితరులు

నెల్లూరు రూరల్, మార్చి 26 : మాజీ మంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా మంగళవారం ఆయన్ను ప్రముఖ న్యాయవాది, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు బద్దేపూడి రవీంద్ర ఘనంగా సత్కరించారు. ఆయనతోపాటు రాష్ట్ర లీగల్ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీలు చుండూరి శ్రీహరి నారాయణరావు, చెన్నమనేని మురళి, న్యాయవాది తాళ్లపాక సునీల్‌కుమార్ సోమిరెడ్డిని ఆయన నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఎన్నికల్లో సర్వేపల్లి నియోజకవర్గం నుంచి ఘన విజయం సాధించి రానున్న ప్రభుత్వంలో మంత్రిగా కొనసాగాలని ఆకాంక్షించారు.

సోమిరెడ్డికి వెల్లువెత్తిన శుభాకాంక్షలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): సర్వేపల్లి నియోజకవర్గం టీడీపీ అభ్యర్థి, మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డికి పుట్టినరోజు శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మంగళవారం నగరంలోని వేదాయపాళెంలో ఉన్న సోమిరెడ్డి కార్యాలయానికి చేరుకుని ఆయనతో భారీ కేక్ కట్ చేయించారు. గజమాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో గెలిచి అసెంబ్లీలో అడుగుపెట్టాలని ఆకాంక్షించారు.

అర్చకులపై దాడి చేసిన వారిని శిక్షించాలి

నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 26 : కాకినాడ శివాలయంలో అర్చకులు సాయిశర్మ, విజయకుమార్ శర్మపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని రాష్ట్ర బ్రాహ్మణ సాధికార కమిటీ మెంబరు, బ్రాహ్మణ క్రెడిట్ సొసైటీ మాజీ డైరెక్టర్ సుధా రవీంద్ర డిమాండ్ చేశారు. మంగళవారం బాలాజీనగర్‌లోని ఆమె నివాసంలో విలేకరులతో మాట్లాడారు. అర్చకులపై భౌతిక దాడికి పాల్పడిన మాజీ కార్పొరేటర్ సిరియాల చంద్రశేఖర్‌పై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. బ్రాహ్మణ సంస్కృతిని తుంగలో తొక్కిన వైసీపీ ప్రభుత్వాన్ని రానున్న ఎన్నికల్లో ఇంటికి పంపాలని బ్రాహ్మణ సామాజిక వర్గానికి ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సేతు మాధవరావు, దేవర్స్ సుబ్బారావు, ఫణి పాల్గొన్నారు.

బీజేపీలోకి చేనేత ప్రముఖులు



పార్టీలో చేరుతున్న చేనేత ప్రముఖులు

నెల్లూరు(క్రైం), మార్చి 26: నెల్లూరుకు చెందిన పలువురు చేనేత ప్రముఖులు బీజేపీలో చేరారు. ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు శీపారెడ్డి వంశీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం విజయవాడలో రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరి సమక్షంలో కాషాయ కండువా కప్పుకున్నారు. వంశీధర్‌రెడ్డి మాట్లాడుతూ చేనేత నేతలు కేవీ శేషయ్య, పులి సురేష్‌బాబు, గుంటి కిషోర్, కోడిపల్లి రాజా, బడతల కోటేశ్వరరావు, కోడూరు శివకుమార్ పార్టీలో చేరడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వాకాటి నారాయణరెడ్డి, పీ సురేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు అభివృద్ధికి నారాయణ గెలవాలి

● పొంగూరు రమాదేవి



కరపత్రాలు పంచుతున్న రమాదేవి

నెల్లూరు(వైద్యం), మార్చి 26 : నెల్లూరు నగరం అన్ని విధాలా అభివృద్ధి చెందాలంటే మాజీ మంత్రి, టీడీపీ నగర అభ్యర్థి పొంగూరు నారాయణ ఎన్నికల్లో గెలవాలని ఆయన సతీమణి రమాదేవి వెల్లడించారు. మంగళవారం నగరంలోని 16వ డివిజన్‌లో బాబు ష్యూరిటీ - భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడారు. ఏ డివిజన్‌కు వెళ్లినా అనూహ్య స్పందన వస్తోందని చెప్పారు. నారాయణను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంచూరు శ్రీనివాసులు, జానకి, చౌదరి తదితర నాయకులు పాల్గొన్నారు.

రేపు రాజగోపాలయ్య అంత్యక్రియలు



రాజగోపాలయ్య(ఫైల్)

నెల్లూరు (సాంస్కృతికం) మార్చి 26 : నీటిపారుదల శాఖ విశ్రాంత ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పార్లపల్లి రాజగోపాలయ్య (93) మంగళవారం స్వర్గస్తులయ్యారు. ఆయన అంత్యక్రియలు గురువారం జరుగుతాయని కుటుంబ సభ్యులు ఓ ప్రకటనలో తెలిపారు. రాజగోపాలయ్య సుదీర్ఘకాలం నీటి పారుదల శాఖలో పనిచేసి, రైతులు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల మన్ననలు పొందారని పేర్కొన్నారు. రాజగోపాలయ్య ఆధ్యాత్మిక, సామాజిక సేవలు ఎన్నో చేశారని తెలిపారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సంస్థకు పెద్ద మొత్తంలో విరాళాలు ఇచ్చార న్నారు. ఆయనకు ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. వీరు అమెరికాలో స్థిరపడ్డారు.

మున్వర్‌కు టీడీపీ నాయకుల నివాళి



మున్వర్‌కు నివాళులర్పిస్తున్న నాయకులు

నెల్లూరు(వైద్యం), మార్చి 26 : నగరంలోని జెండావీధికి చెందిన వక్ఫ్‌బోర్డు మాజీ ఛైర్మన్ షేక్ మున్వర్ మృతికి టీడీపీ నేతలు సంతాపం తెలిపారు. రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, మాజీ మంత్రులు పొంగూరు నారాయణ, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, టీడీపీ నెల్లూరు పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్ తదితరులు మంగళవారం మున్వర్ నివాసానికి వెళ్లి ఆయన పార్థివ దేహానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. పవిత్ర రంజాన్ మాసంలో అల్లాహ్ నుంచి పిలుపు రావటం మున్వర్ చేసిన మంచి పనులకు నిదర్శనమన్నారు.

నేత్రదానం



సుధాకర్‌రావు (ఫైల్)

నెల్లూరు(వైద్యం) : పోలీస్ కాలనీకి చెంది న అద్దంకి సుధాకర్ రావు(68) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. ఆయన నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేశారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఐడొనేషన్ కౌన్సిలర్ బాలాజీసింగ్, ఎల్‌వీ ప్రసాద్ ఐ ఆసుపత్రి టెక్నీషియన్ లాలేష్ ఈ నేత్రాలను సేకరించారు.

'పది' పరీక్షలకు 29,863 మంది హాజరు

నెల్లూరు (విద్య) : జిల్లాలో మంగళవారం పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో బయలాజికల్ సైన్స్ పరీక్ష నిర్వహించారు. 31,702 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 29,863 మంది హాజరు కాగా 1,839 మంది గైర్హాజరయ్యారు. వీరిలో రెగ్యులర్ విద్యార్థులు 29,371 మందికి 28,530 మంది హాజరయ్యారు. ప్రైవేట్ విద్యార్థులు 2,331 మందికి 1,333 మంది హాజరయ్యారు. విద్యాశాఖ జేడీ, జిల్లా పరిశీలకుడు మువ్వా రామలింగం 8 కేంద్రాలను, డీఈవో పీజేవీ రామారావు 2, ఫ్లైయింగ్ స్క్వాడ్ 49 కేంద్రాలను పరిశీలించారు.

పాఠశాల ఉద్యోగి కుటుంబానికి బీటీఏ సాయం



కమిషనర్ సమక్షంలో చెక్కు అందచేస్తున్న బీటీఏ నాయకులు

నెల్లూరు (విద్య), మార్చి 26 : నగరంలోని దర్గామిట్ట నగర పాలక సంస్థ ప్రాథమికోన్నత పాఠశాలలో కంప్యూటర్ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తూ రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందిన ప్రవీణ్ కుమార్ కుటుంబానికి బహుజన టీచర్స్ అసోసియేషన్ సాయం చేసింది. నగర పాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్ వికాస్ మర్మత్ ద్వారా మంగళవారం రూ.1,76,014లకు చెక్కును అందజేసింది. కమిషనర్ మాట్లాడుతూ ప్రవీణ్‌కుమార్ ఈ నెల 6వ తేదీన మృతి చెందారని, చిన్నవయసులో మరణించడం బాధాకరమన్నారు. ఆయన కుటుంబాన్ని ఆదుకునేందుకు బీటీఏ ముందుకు రావడం అభినందనీయమన్నారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన అన్ని సదుపాయాలు కూడా బాధిత కుటుంబానికి అందేలా కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీటీఏ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు పల్లం వేణుగోపాల్, కార్యదర్శి చిట్టేటి రమేష్, ఉపాధ్యక్షుడు మనోజ్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి మాసా ప్రసాద్, కార్యదర్శి రఘు, ఉపాధ్యక్షులు కొమ్మల కృష్ణయ్య, రవి, నగర కార్యదర్శి మల్లికార్జున పాల్గొన్నారు.

ఫుట్‌పాత్ ఇలా.. నడిచేదెలా ?




పోలీస్‌స్టేషన్ వద్ద రాళ్లు లేచిపోయిన ఫుట్‌పాత్

వెంకటాచలం, మార్చి 26 : వెంకటాచలంలోని జాతీయ రహదారి అంచున నిర్మించిన ఫుట్‌పాత్‌పై నడవాలంటే పాదచారులు ఆందోళన చెందుతున్నారు. సర్వేపల్లి క్రాస్‌రోడ్డు సెంటర్ నుంచి స్వర్ణ భారత్ ట్రస్ట్ వరకు సర్వీస్ రోడ్డుకు ఇరు వైపులా కిలోమీటర్ దూరం ఫుట్‌పాత్ ఉంది. దీనిపై ఉన్న రాళ్లు లేచిపోయి అక్కడక్కడ గుంతలు ఏర్పడ్డాయి. నిత్యం వందలాదిమంది ఈ ఫుట్ పాత్‌పై రాకపోకలు కొనసాగించాల్సి ఉంది. ఫుట్‌పాత్ సక్రమంగా లేకపోవటంతో నిత్యం ప్రమాదాలకు గురవుతున్నారు. స్వర్ణటోల్‌ప్లాజా నిర్వాహకులు ఫుట్‌పాత్‌కు మరమ్మతులు చేయాలని పలువురు కోరుతున్నారు.

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలుచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పత్రిక పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ కింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

నెల్లూరు ఏసీఎం	9985411424
నెల్లూరు ఏసీవో	9542727676
నెల్లూరు సిటీ	8179815202
నెల్లూరు రూరల్	8885688410
కోవూరు	8008894200



మిత్రులు శత్రువులై.. శత్రువులు మిత్రులై..

'రాజకీయాలలో శాశ్వత శత్రువులు గానీ, శాశ్వత మిత్రులుగానీ ఉండరు' అనేది నానుడి. ఈ నానుడి గూడూరు నియోజకవర్గంలో నిజమైంది. 2019 ఎన్నికల్లో గూడూరు అసెంబ్లీ స్థానం నుంచి టీడీపీ అభ్యర్థిగా పాశిం సునీల్‌కుమార్, వైసీపీ అభ్యర్థిగా వెలగపల్లి వరప్రసాదరావు తలపడ్డారు.పోటాపోటీగా సాగిన ప్రచారాల్లో మాటలకత్తులు దూసుకున్నారు. విజయం వరప్రసాదరావునే వరించింది. అయితే ఈయనకు ఈసారి వైసీపీ టికెట్ నిరాకరించింది. దీంతో ఆయన బీజేపీలో చేరి తిరుపతి పార్లమెంటు స్థానానికి బీజేపీ అభ్యర్థిగా బరిలోకి దిగుతున్నారు.గూడూరు అసెంబ్లీ టీడీపీ అభ్యర్థిగా ఈసారి కూడా పాశిం సునీల్‌కుమార్ పోటీ చేస్తున్నారు. గతంలో బరిలో తలపడ్డ ఈ ఇద్దరూ ఈసారి మిత్ర కూటమి అభ్యర్థులు కావడంతో, కలిసిమెలిసి ఒకరి గెలుపు కోసం మరొకరు ప్రచారం చేయబోతున్నారు. అలాగే 2021 ఉప ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థి గురుమూర్తి గెలుపు కోసం కృషి చేసిన వరప్రసాదరావు, ఈసారి ఆయనకే ప్రత్యర్థిగా మారి సవాలు చేస్తున్నారు.

- గూడూరు

చిన్నారులతో వైసీపీ ప్రచారం



ఏర్పేడు మండలం మోదుగులపాళం పంచాయతీలో మంగళవారం వైసీపీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు.చిన్నారులకు కూడా వైసీపీ కండువాలు కప్పి జెండాలు పట్టించి ప్రచారంలో వాడుకోవడంపై జనం తిట్టుకున్నారు.

- ఏర్పేడు

తిరుమలలో హీరో రామ్‌చరణ్



శ్రీవారి దర్శనార్థం హీరో రామ్‌చరణ్ భార్య ఉపాసన,కుమార్తె క్లీంకారతో కలిసి మంగళవారం సాయంత్రం తిరుమలకు వచ్చారు. ఫీనిక్స్(శ్రీవేంకటేశ్వర నిలయం) అతిథిగృహానికి రాత్రి 7.30 గంటలకు చేరుకున్న వారికి స్థానిక అభిమానులు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. రాంచరణ్ దంపతులు బుధవారం ఉదయం శ్రీవారిని దర్శించుకోనున్నారు.

- తిరుమల,ఆంధ్రజ్యోతి

రోజాకు అసమ్మతి వర్గం ఆఖరి ఝలక్!

సహకరించబోమని సజ్జల సమక్షంలో తేల్చి చెప్పేసిన నాయకులు

తిరుపతి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): నగరిలో రోజా గెలుపునకు సహకరించే ప్రసక్తే లేదని ఆ నియోజకవర్గ వైసీపీ అసమ్మతి నేతలు అధిష్ఠానానికి తమ చివరి మాటగా తేల్చి చెప్పేశారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం సీఎం క్యాంపు కార్యాలయం నుంచీ పిలుపు రావడంతో సోమవారం రాత్రి శ్రీశైలం దేవస్థానం ట్రస్టుబోర్డు ఛైర్మన్ రెడ్డివారి చక్రపాణి రెడ్డి, నింద్ర మండల నేత రెడ్డివారి భాస్కర రెడ్డి, పుత్తూరు మాజీ ఎంపీపీ ఏలుమలై మొదలియార్, ముఖ్యనేత రవి శేఖర రాజు, వడమాలపేట జడ్పీటీసీ మురళీధర రెడ్డి, విజయపురం మండల నేత లక్ష్మీపతి రాజు తదితరులు ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, సీఎం కార్యదర్శి ధనంజయరెడ్డిలతో సమావేశమయ్యారు. రోజా నుంచీ తాము ఎదుర్కొన్న ఇబ్బందులను, వేధింపులను ఏకరువు పెట్టారు. ఓపిగ్గా విన్న సజ్జల, ధనుంజయ రెడ్డి ఈసారికి తమ ముఖం చూసి రోజా గెలుపునకు సహకరించాలని సూచించినట్లు తెలిసింది. అయితే తాము పనిచేసినా రోజా గెలిచే పరిస్థితే లేదని వారు చెప్పినట్టు తెలుస్తోంది. ఈ దశలో హఠాత్తుగా గదిలోకి మంత్రి రోజా, ఆమె భర్త సెల్వమణి వచ్చారని, అసమ్మతి నేతలకు నమస్కరించి పలకరించినా వారు స్పందించలేదని అంటున్నారు. ఈ రెండు వర్గాలనూ విడివిడి గదుల్లో ఉంచి సజ్జల, ధనుంజయరెడ్డి మంతనాలు జరిపినట్లు తెలిసింది. చివరికి అసమ్మతి నేతలు మాత్రం, తాము వద్దన్నా రోజాకే టికెట్ ఇచ్చారని, ఎట్టి పరిస్థితుల్లోనూ ఆమెకోసం తాము ఎన్నికల్లో పనిచేయమని తేల్చి చెప్పి వెనుదిరిగారని చెబుతున్నారు. దీంతో నగరి వైసీపీలో మంత్రి రోజాకు, ఆమె వ్యతిరేక వర్గానికీ నడుమ సయోధ్య కుదిరే అవకాశాలు ఇక లేవని తేలిపోయింది. దీంతో అసమ్మతి వర్గం నేతలు తదుపరి ఏ నిర్ణయం తీసుకుంటారన్నది ఆసక్తిగా మారింది.

కుప్పం నేలపై నడిస్తే అరిగిపోతావా?

- నీళ్లే ఇవ్వకుండా సెట్టింగులతో డ్రామాలా?
- సీఎం జగన్‌పై చంద్రబాబు విమర్శ
- అధికారంలోకి వచ్చిన ఏడాదిలో హంద్రీ నీవాకు నీళ్లిస్తామని హామీ




నీళ్లులేని హంద్రీ నీవా కాలువలో కబడ్డీ ఆడుతున్న టీడీపీ శ్రేణులు.. - రాజుపేట వద్ద గేటు కింద చూస్తున్న చంద్రబాబు

రామకుప్పం/వి.కోట, మార్చి 26: కుప్పం నేలపై నడిస్తే అరిగిపోతావని రెండు హెలిప్యాడ్లు ఏర్పాటు చేసుకుని తిరిగావంటూ సీఎం జగన్‌పై టీడీపీ అధినేత చంద్రబాబు విమర్శ చేశారు. రామకుప్పం మండలం రాజుపేట వద్ద హంద్రీ నీవా కాలువను మంగళవారం సాయంత్రం పరిశీలించిన ఆయన మీడియాతో మాట్లాడారు. 'నేను సీఎంగా ఉండి కుప్పం బ్రాంచ్ కెనాల్ పనులు 90 శాతం చేపట్టి వి.కోట వరకు నీళ్ల తెచ్చా. వైసీపీ అధికారంలోకి వచ్చిన ఐదేళ్లలో మిగిలిన పది శాతం పనులు పూర్తి చేయకుండా సినిమా సెట్టింగులతో కుప్పానికి నీళ్లిచ్చామని ప్రజలను మభ్యపెట్టారు. నీతి, నిజాయితీకి మారుపేరైన కుప్పం ప్రజలను నీటి డ్రామాతో మోసగించడానికి మనసెలా వచ్చింది' అంటూ సీఎంను ప్రశ్నించారు. ఇలాంటి డ్రామా లు కుప్పం ప్రజలు నమ్మరన్నారు. తాము అధికారంలోకి వచ్చిన ఏడాదిలో కుప్పానికి హంద్రీ, నీవా ద్వారా పూర్తి స్థాయిలో నీరిచ్చి అన్ని చెరువులను నింపుతామని హామీ ఇచ్చారు. 'నాడు తాను అమలు చేసిన ఇజ్రాయెల్ తరహా బిందుసేద్యం ప్రాజెక్టును.. తండ్రి (వైఎస్) ఆపేశారు. నేడు కొడుకు (జగన్) వచ్చి కుప్పాన్ని సర్వ నాశనం చేయడమే కాకుండా, సంపదను కొల్లగొట్టారు' అంటూ పోల్చి చెప్పారు. 'నేను కుప్పం కంటే ముందే పులివెందులకే నీళ్లిచ్చా. అది నీకు.. నాకు ఉన్న తేడా. నీతో పాటు నీ అనుచరవర్గం కుప్పంలో దౌర్జన్యాలు, అక్రమాలు చేస్తున్నారనడానికి నిదర్శనం గుండిశెట్టిపల్లె సమీపంలోని బసవేశ్వరస్వామి భూములను కొట్టేయాలని చూడటమే. ఇలాంటివి ఎప్పటికీ జరగనివ్వను' అని చంద్రబాబు స్పష్టంచేశారు. గుడుపల్లె మండలం యామిగానిపల్లె వద్ద రూ.364 కోట్లతో.. శాంతిపురం మండలం మాదనపల్లె వద్ద రూ.170 కోట్లతో రిజర్వాయర్ల నిర్మాణానికి పనులు మంజూరు చేశామన్నారు. ఇప్పుడు వీళ్ల మంజూరు చేసినట్లు చెప్పుకోవడానికి సిగ్గులేదా అని వైసీపీ ప్రభుత్వాన్ని నిలదీశారు. కాగా, రాజుపేట వద్ద 15-20 అడుగుల లోతున్న హంద్రీ నీవా కాలువలోకి చంద్రబాబు దిగారు. దిగేటప్పుడు.. మళ్లీ ఎక్కేటప్పుడు సెక్యూరిటీ సిబ్బంది, నాయకులు సాయం అందించేందుకు ప్రయత్నించినా ఆయన అంగీకరించలేదు. 74 ఏళ్ల వయసులోనూ ఆయన ఉత్సాహంగా కాలువలోకి దిగి పరిశీలించారు.



కాలువలో నడిచి వస్తున్న చంద్రబాబు

నేడు పుత్తూరులో ప్రజాగళం సభ

తిరుపతి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత చంద్రబాబు ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రజాగళం పేరిట పర్యటనలకు నేటినుంచీ శ్రీకారం చుడుతున్నారు. పలమనేరులో బుధవారం ఉదయం 11 నుంచీ మధ్యాహ్నం 12.30 గంటల వరకూ ప్రజాగళం తొలి బహిరంగసభలో ప్రసంగిస్తారు. ఆపై గంట పాటు విశ్రాంతి తీసుకుని పుత్తూరు చేరుకుంటారు. మధ్యాహ్నం 2.30గంటల నుంచి 4గంటల దాకా పుత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని కాపువీధి జంక్షన్‌లో జరిగే సభలో పాల్గొంటారు.సాయంత్రం 5 గంటలకు మదనపల్లెకు చేరుకుని బెంగుళూరు బస్టాండు కూడలిలో 5.30 నుంచీ 7.30గంటల వరకూ బహిరంగసభలో పాల్గొంటారు. పుత్తూరు సభకు నగరి ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్ విస్తృత ఏర్పాట్లు చేపట్టారు.

శ్రీకాళహస్తీశ్వరుడి సేవలో సీజేఐ

నేడు శ్రీవారి దర్శనం

శ్రీకాళహస్తి/తిరుచానూరు/తిరుమల, మార్చి 26(ఆంధ్రజ్యోతి): సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ మంగళవారం శ్రీకాళహస్తీశ్వర స్వామిని దర్శించుకున్నారు.సాయంత్రం 6గంటలకు ఆలయానికి చేరుకున్న ఆయన 7.30గంటల దాకా అక్కడే గడిపారు.అనంతరం తిరుచానూరు చేరుకున్న ఆయన పద్మావతి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయన వెంట ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ సహా పలువురు న్యాయమూర్తులున్నారు.ఆలయ వేదపండితులు అమ్మవారి శేషవస్త్రంతో సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు.అనంతరం తిరుమల బయల్దేరిన సీజేఐ రచన అతిథిగృహానికి రాత్రి 10.30 గంటలకు చేరుకున్నారు.టీటీడీ ఈవో ధర్మారెడ్డి, సీవీఎస్వో నరసింహకిషోర్ స్వాగతం పలికారు. అంతకుముందే ఏపీ హైకోర్టు ప్రధానన్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ కూడా తిరుమలకు చేరుకున్నారు. వీరు బుధవారం ఉదయం శ్రీవారిని దర్శించుకోనున్నారు.

టాస్క్‌ఫోర్సు ఎస్పీకి బంగారు పతకం

- జిల్లాలో 28మందికి డీజీపీ పతకాలు

తిరుపతి క్రైం, మార్చి 26 : జిల్లావ్యాప్తంగా 28మంది పోలీసు అధికారులకు,సిబ్బందికి డీజీపీ పతకాలు ప్రకటించారు.బంగారు పతకాన్ని తిరుపతి టాస్క్‌ఫోర్సు ఎస్పీ రిషాంత్‌రెడ్డికి ప్రదానం చేయనున్నారు. వీరితో పాటు 20మందికి కాంస్య పతకాలు ప్రకటించారు. వీరిలో డీఎస్పీ బాబురెడ్డి, సీఐ వెంకటేశ్వరరెడ్డి, వడమాల పేట ఏఎస్ఐ రామకృష్ణారెడ్డి, పెళ్లకూరులో పనిచేస్తున్న షేక్ అబ్దుల్ రహీమ్, తిరుపతి సీసీఎస్‌లో పనిచేస్తున్న హెడ్ కానిస్టేబుల్ గోపీకృష్ణ, డీఎస్ఆర్‌బీ కానిస్టేబుల్ చెంగల్ రెడ్డి, రిజర్వు హెడ్ కానిస్టేబుల్ రెడ్డిమోహన్, సైబర్ క్రైంలో పనిచేస్తున్న లక్ష్మయ్యకార్తీక్, మునిరామయ్య, పుత్తూరులో పనిచేస్తున్న రమేష్, తిరుపతి టాస్క్‌ఫోర్సు కానిస్టేబుల్ భాస్కరనాయక్, దిశ స్టేషన్‌లో పనిచేస్తున్న ఆర్ కెఎం ఆషా, వెంకటగిరి 9వ బెటాలియన్‌లో ఏఆర్ఎస్ఐ రాజశేఖర్, హెడ్‌కానిస్టేబుల్ ఎ. శంకరయ్య, మునెయ్య, కానిస్టేబుల్ రోశయ్య ,టాస్క్‌ఫోర్సులో పనిచేస్తున్న హరిబాబు, పోలీసు శిక్షణా కళాశాలలో ఏఆర్ఎస్‌గా పనిచేస్తున్న ఎస్.విజయ, ఎస్ఐ శ్రీనివాసులు, ఇంటెలిజెన్సు విభాగంలో పనిచేస్తున్న హెడ్ కానిస్టేబుల్ సోమశేఖర్‌లకు డీజీపీ కాంస్య పతకాలు ప్రకటించారు. వీరితో పాటు రజత పతకాలను ఏడుగురికి ప్రకటించారు.తిరుపతి ఎస్పీగా పనిచేసి బదిలీ అయిన మల్లిక గార్గ్, దిశ ఏఎస్ఐ ప్రసాద్‌రాజు, గూడూరు రూరల్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ ఆర్.వెంకటేశ్వరరాజు, కేవీబీపురంలో కోర్టు కానిస్టేబుల్ దామోదరం, తిరుపతి రిజర్వు పీసీ చంద్రశేఖర్, ఏపీ ఎస్పీ 9వ బెటాలియన్‌లో పనిచేస్తున్న పరంధామయ్య, ఆర్ఎస్ఐ వై.జాలయ్య వీరిలో ఉన్నారు.

ఉపాధి హామీ ఉద్యోగి తొలగింపు



వైసీపీ ప్రచారంలో పాల్గొన్న పరశురాం

తిరుపతి(కలెక్టరేట్)/కేవీబీపురం, మార్చి 26: కేవీబీపురం మండలం కాళంగి గ్రామంలో ఉపాధి హామీ పథకంలో కాంట్రాక్టు ప్రాతిపదికన క్షేత్రసహాయకుడిగా పనిచేస్తున్న పరశురామ్‌ను విధుల నుంచి తొలగించారు.ఆదరం, కాళింగి గ్రామాల్లో ఓమవారం జరిగిన వైసీపీ ప్రచార కార్యక్రమంలో పాల్గొనడంతో డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్ అతన్ని విధుల నుంచి తొలగించారు.

సమాజ నిర్మాణంలో లాయర్ల పాత్ర కీలకం

- సీజేఐ జస్టిస్ డి.వై. చంద్రచూడ్

తిరుపతి (కల్చరల్), మార్చి 26: సమాజ నిర్మాణంలో న్యాయవాదుల పాత్ర ఎంతో విలువైనదని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై. చంద్రచూడ్ అన్నారు.తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం న్యాయశాస్త్ర విభాగంలో ఐదు సంవత్సరాల లా కోర్సు ప్రారంభించి దశాబ్ది కాలమైన సందర్భంగా నిర్వహిస్తున్న ఉత్సవాలను ఆయన మంగళవారం ఉదయం ప్రారంభించారు.ఈ సందర్భంగా సీజేఐ మాట్లాడుతూ.. అనేక వైరుధ్యాలతో కూడుకున్న భారత సమాజంలో అన్యాయం జరిగిన వారికి న్యాయం అందించడం ఎంతో సంయమనంతో చేయవలసిన పని అన్నారు. ఇపుడు విస్తరిస్తున్న కృత్రిమ మేధస్సుతో లా విభాగంలో కూడా చాలా మార్పులు వస్తాయని, వాటిని కొత్త తరం న్యాయవాదులు అందిపుచ్చుకోవాలని సూచించారు.తన తండ్రి , సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ వై. బి. చంద్రచూడ్ ఎస్వీ యూనివర్శిటీకి 1982మార్చిలో వచ్చారని గుర్తు చేసుకున్నారు.సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఒక కుటుంబానికి పెద్ద లాంటి వ్యక్తిగా అర్థం చేసుకోవాలని ,వివిధ రాష్ట్రాల, వివిధ న్యాయశాస్త్ర విభాగాల్లో నిష్ణాతులైన న్యాయమూర్తులతో కొలీజియం వ్యవస్థ ముందుకు సాగుతోందని తెలిపారు. తాము విశ్రాంతిగా కాఫీ తాగే సమయంలో కూడా తమ భుజస్కంధాలపై ఎంతటి బాధ్యతలు వున్నాయో గుర్తు చేసుకుంటూ వుంటామన్నారు. నేషనల్ లా యూనివర్సిటీల్లో చదివినవారే మాత్రమే గొప్పగా రాణిస్తారని అనుకోవడం నిజం కాదని, ఎస్వీయూలో చదివినా కృషితో మంచి న్యాయాన్ని సమాజానికి అందించవచ్చునని తెలిపారు. ఎస్వీయూ వీసీ వి.శ్రీకాంత్ రెడ్డి, రిజిస్ట్రార్ ఓ. మహ్మద్ హుసేన్, ఎస్వీయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ జి. పద్మనాభం, డీన్ కృష్ణయ్య, హైకోర్టు న్యాయమూర్తి దుర్గాప్రసాదరావు, మహిళా విశ్వ విద్యాలయ వీసీ భారతి, రిజిస్ట్రార్ రజని, జిల్లా అధికారులు, లా విద్యార్థులు పాల్గొన్నారు.



జస్టిస్ చంద్రచూడ్ దంపతులను సత్కరిస్తున్న ఎస్వీయూ వీసీ శ్రీకాంత్ రెడ్డి తదితరులు

వైసీపీ ప్రచార సామగ్రి సీజ్ చేసేవరకూ కదిలేది లేదు

- అర్ధరాత్రి గోదాముల వద్ద పులివర్తి నానీ బైఠాయింపు

తిరుపతి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): రేణిగుంట మండలంలో పాత విమానాశ్రయం వద్ద ఉన్న ప్రైవేటు గోదాముల్లో నిల్వ వుంచిన వైసీపీ ప్రచార సామగ్రిని సీజ్ చేసేవరకూ ఇక్కడి నుంచీ కదిలేది లేదంటూ చంద్రగిరి టీడీపీ అభ్యర్థి పులివర్తి నానీ సంబంధిత గోదాముల వద్ద మంగళవారం అర్ధరాత్రి బైఠాయించారు. మొత్తం మూడు గోదాములుండగా అధికారులు కేవలం ఒక గోదాము మాత్రమే తెరిచి సామగ్రి పరిశీలించారని, మిగిలిన రెండు గోదాములను తెరవలేదని ఆరోపించారు. తెరిచిన గోదాములో కూడా వస్తువులను సీజ్ చేయలేదని, పంచనామా చేయలేదని, గోదాముకు సీల్ కూడా వేయలేదని ఆరోపించారు. రేణిగుంట తహసిల్దారు నాగేశ్వరరావు నిర్లక్ష్యంగా వ్యవహరించారని, గోదాముకు తాళం మాత్రం వేసుకుని వెళ్లారని ఆరోపించారు. ఆ గోదాముకు వెనుక తలుపు తెరిచే వుందన్నారు. మొత్తం రూ. 30 కోట్ల విలువైన ఎన్నికల ప్రచార సామగ్రి గోదాముల్లో నిల్వ వుంచారని ఆరోపించారు. గోదాముల్లో వున్న సామగ్రిలో వాచీలు, స్పీకర్లు, చీరలు వంటి పలు వస్తువులు ఓటర్లను ప్రలోభపెట్టడానికి ఉద్దేశించినవేనన్నారు. ఎన్నికల సంఘం తక్షణం జోక్యం చేసుకోవాలని ఆయన కోరారు.



వైసీపీ ప్రచార సామగ్రిని పరిశీలిస్తున్న నానీ తదితరులు

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (బుధవారం) : సా. 6.27
సహరి (గురువారం) : ఉ. 4.52

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

30న నాయుడుపేటకు చంద్రబాబు రాక

నాయుడుపేట టౌన్, మార్చి 26: టీడీపీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈనెల 30వ తేదీ శనివారం నాయుడుపేటకు రానున్నట్లు సూళ్లూరుపేట నియోజకవర్గ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం తెలిపారు. ప్రజాగళం యాత్రలో భాగంగా 30వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు నాయుడుపేటలోని ఏఎల్‌సీఎం క్రీడా మైదానానికి హెలికాప్టర్‌లో చేరుకుంటారని, అక్కడ నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలతో కలసి అంబేద్కర్ విగ్రహం వద్ద వరకు మోటారు సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు నెలవల తెలిపారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహం సమీపంలో ఉన్న పాతబస్టాండ్ వద్ద జరిగే సభలో ప్రసంగిస్తారని చెప్పారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఏఎల్‌సీఎం క్రీడా మైదానాన్ని కుందుర్తి ఎమ్మెల్యే వెంకటేష్‌తో పాటు నెలవల పరిశీలించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పసల గంగాప్రసాద్, నాగేంద్రరెడ్డి, రఫీ, వేమసాని శోభన్‌నాయుడు తదితరులు ఉన్నారు.

గుంతలమయంగా చెంబేడు రోడ్డు



పునబాక రైస్‌మిల్లు ఎస్టీకాలనీ వద్ద రాళ్లు తేలిన తారురోడ్డు

పెళ్లకూరు, మార్చి 26: మండలంలోని పునబాక రైస్‌మిల్లు ఎస్టీ కాలనీ నుంచి చెంబేడు 71వ జాతీయ రహదారి వరకు గల ఆర్‌అండ్‌బీ రోడ్డు అడుగడుగున గుంతలమయంగా మారింది. దీంతో ఈ రహదారిపై రాకపోకలు సాగించాలంటే వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. ఈ ప్రాంతంలో పరిశ్రమలు ఉండడంతో ప్రతి రోజు భారీ వాహనాలు వెళ్తుండడంతో రహదారి అధ్వాన స్థితికి చేరింది. అడుగుడునా గుంతలు ఏర్పడడంతో తరచూ ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రహదారికి మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

కుదిరి చెరువులో అక్రమ నిర్మాణాలు



కుదిరి చెరువులో చేపట్టిన నిర్మాణం

సూళ్లూరుపేట, మార్చి 26: కోడ్ కూయడంతో అధికారులు ఎన్నికల పనుల్లో నిమగ్నమై ఉండడంతో అక్రమ నిర్మాణాలు ఊపందుకొన్నాయి. మండల పరిధిలోని కుదిరి చెరువులో మూడు రోజుల నుంచి అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. కొందరు అక్రమార్కులు గతంలో మట్టితోలి చెరువును పూడ్చేసి నిర్మాణాలు చేపట్టారు. ఆయకట్టు రైతులు రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేయడంతో అధికారులు నోటీసులు జారీ చేసి పనులను నిలిపివేశారు. ఎన్నికల వేళ కొత్తగా వచ్చిన అధికారులు ఎవరూ పట్టించుకోరనే ఉద్దేశంతో చెరువులో అక్రమ నిర్మాణాలను కొనసాగిస్తున్నారు. అధికారులు స్పందించి చెరువులో నిర్మాణాలను అడ్డుకోవాలని రైతులు కోరుతున్నారు.

పోలేరమ్మ హుండీ లెక్కింపు



హుండీ లెక్కిస్తున్న ఆలయ అధికారులు

వెంకటగిరిటౌన్, మార్చి 26: వెంకటగిరి గ్రామశక్తి పోలేరమ్మ హుండీ ఆదాయాన్ని దేవదాయశాఖ ఆధ్వర్యంలో స్థానిక పాతకోట వద్ద ఉన్న రామాలయంలో మంగళవారం లెక్కించారు. 5నెలల 19 రోజులల్లో భక్తులు సమర్పించిన కానుకల ద్వారా రూ.2524338 నగదు, బంగారం 22గ్రాములు, వెండి 284 గ్రాములు వచ్చినట్లు ఆలయ ఈవో శ్రీనివాసులురెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవదాయ, రెవెన్యూ, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

సూళ్లూరుపేటలో టీడీపీ జెండా ఎగరేస్తాం



సోమిరెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న టీడీపీ నేతలు

పెళ్లకూరు, మార్చి 26: సూళ్లూరుపేట నియోజకవర్గంలో డాక్టర్ నెలవల విజయశ్రీని గెలిపించి టీడీపీ జెండా ఎగరవేస్తామని ఆ పార్టీ నేతలు స్పష్టం చేశారు మంగళవారం సోమిరెడ్డి జన్మదినం సందర్భంగా నెల్లూరులో ఆయనను కలసి పుష్పగుచ్ఛం అందజేసి శాలవాలు కప్పి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి స్థానిక రాజకీయ స్థితిగతులపై ఆరా తీశారు. టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వేలూరు మరళీకృష్ణారెడ్డి, ఉమ్మడి నెల్లూరు జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు కందమూడి శివకుమార్, నాయకులు కలవకోలు మునీష్, శిరసనంబేటి సుధాకర్‌రెడ్డి తదితరులు మాట్లాడుతూ టీడీపీ గెలుపే లక్ష్యంగా కృషి చేస్తున్నామని, త్వరలో జరిగే ఎన్నికల్లో విజయం ఖాయమని వివరించారు.

సోమిరెడ్డికి టీడీపీ నేతల శుభాకాంక్షలు

నాయుడుపేట టౌన్, మార్చి 26: మాజీ మంత్రి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి జన్మదిన వేడుకల్లో నాయుడుపేట టీడీపీ నాయకులు పాల్గొన్నారు. నెల్లూరు నగరం అల్లీపురంలోని ఆయన నివాసంలో సోమిరెడ్డిని కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో గూడూరు సుధీర్‌రెడ్డి, అవధానం సుధీర్, షేక్ కాలేషా, సుబ్బారెడ్డి, తులసీరామ్ తదితరులు పాల్గొన్నారు.

ఏటీఎం దొంగ అరెస్టు: రూ.1.04 లక్షలు స్వాధీనం

తిరుపతి క్రైం, మార్చి 26: ఏటీఎంల వద్ద నగదు డ్రాచేసి ఇస్తానని నమ్మించి పలువురి ఖాతాల నుంచి నగదు కాజేసిన దొంగను పోలీసులు అరెస్టు చేశారు. అతడి నుంచి రూ.1.04 లక్షలు నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈస్ట్ పోలీసుల కథనం మేరకు.. ఏర్పేడు మండలం కందాడ గ్రామానికి చెందిన మునిసుబ్రహ్మణ్యం ఏటీఎంల వద్ద కాపుకాసి వృద్ధులు, మహిళలు, నిరక్షరాస్యులకు నగదు డ్రాచేసి ఇచ్చేవాడు. ఆ సమయంలో వారి కార్డు బదులు నకిలీ కార్డు ఇచ్చేవాడు. తర్వాత ఖాతాలను ఖాళీ చేసేవాడు. ఈ క్రమంలో సోమవారం తిరుపతి లీలామహల్ సర్కిల్లోని ఎస్‌బీఐ ఏటీఎం వద్ద జయంతి అనే వృద్ధురాలి నుంచి ఏటీఎం కార్డు తీసుకుని ఆమెకు నగదు డ్రా చేసి ఇచ్చాడు. తరువాత నకిలీ కార్డును ఆమెకు ఇచ్చాడు. జయంతి కార్డు ద్వారా పలుసార్లు రూ.1.33 లక్షలు డ్రా చేసుకున్నాడు. ఈ విషయం తెలుసుకున్న బాధితురాలు ఈస్ట్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్‌ఐ లావణ్య కేసు నమోదు చేసుకుని నిందితుడిని అరెస్టు చేశారు. నిందితుడు ఇప్పటికే శ్రీకాళహస్తి, గాజులమండ్యం, పుత్తూరు, వడమాలపేట ప్రాంతాల్లో ఏటీఎంల వద్ద పలువురిని మోసగించి నగదు కాజేశాడు.

రేషన్ బియ్యం స్వాధీనం



పట్టుబడిన రేషన్ బియ్యం బస్తాలు

సూళ్లూరుపేట, మార్చి 26: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని విజిలెన్స్, సివిల్ సప్లయాయ్ అధికారులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. విజిలెన్స్ ఎస్‌ఐ రామకృష్ణ నాయక్, సీఎస్ డీటీ ఓబయ్య కథనం మేరకు.... మండల పరిధిలోని పెరిమిటిపాడు సమీపంలో అక్రమంగా తరలించేందుకు మినీ లారీల్లో సిద్ధంగా ఉన్న ఉన్న రేషన్ బియ్యాన్ని విజిలెన్స్, సివిల్ సప్లయాయ్ అధికారులు గుర్తించారు. చి స్వాధీనం చేసుకొన్నారు. అధికారులను చూడగానే బియ్యం లోడుతో ఉన్న రెండు వాహనాలను అక్రమార్కులు వదిలేసి పారిపోయారు. మినీ లారీల్లో ఉన్న 76 బస్తాల రేషన్ బియ్యం బస్తాలను అధికారులు స్వాధీనం చేసుకుని సివిల్ సప్లయాయ్ గోదాముకు తరలించారు. పట్టుబడిన బియ్యం విలువ రూ.లక్ష 50వేలు ఉంటుందని, ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు విజిలెన్స్ ఎస్‌ఐ తెలిపారు.

చంద్రబాబుతోనే అభివృద్ధి, సంక్షేమం: నెలవల

దొరవారిసత్రం, మార్చి 26: చంద్రబాబునాయుడుతోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని మాజీ ఎంపీ, నియోజకవర్గ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. దొరవారిసత్రం మండలం నెలబల్లిలో మంగళవారం ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ విజయశ్రీ, టీడీపీ మండల అధ్యక్షుడు వేమసాని శ్రీనివాసులునాయుడు, పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా నెలవల మాట్లాడుతూ గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో ఎటువంటి అభివృద్ధి పనులు జరగలేదని, గత టీడీపీ ప్రభుత్వంలో పట్టణాలకు దీటుగా గ్రామాల్లో వేసిన సిమెంట్ రోడ్లు, డ్రైనేజీలు, ఎల్ఈడీ కాంతులు దర్శనమిస్తున్నాయన్నారు. చంద్రబాబునాయుడుతోనే అన్నివర్గాల అభ్యున్నతి సాధ్యమని, వచ్చే ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మనోహర్‌రెడ్డి, గోనుజక్కరయ్య, జాన్‌రమేష్, భాస్కర్‌రెడ్డి, షబ్బీర్, కృష్ణమూర్తి, గోపాల్‌రెడ్డి, నెలవల రాజేష్, రత్నయ్య, ముత్యాలబాబు, పురుషోత్తమ్‌యాదవ్, మల్లికార్జునయాదవ్, మధునాయుడు, నాగేంద్రరెడ్డి, సుజాతమ్మ, ప్రమీలమ్మ తదితరులు పాల్గొన్నారు.



నెలబల్లిలో పర్యటిస్తున్న నెలవల, ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ విజయశ్రీ

ఒక్కఛాన్స్‌తో రాష్ట్రాన్ని అంధకారంలోకి నెట్టిన వైసీపీ: టీడీపీ



కరపత్రాలు పంపిణీ చేస్తున్న పాశం సంధ్యారాణి

గూడూరు, మార్చి 26: ఒక్కఛాన్స్‌తో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని అంధకారంలోకి నెట్టివేసిందని మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ సతీమణి సంధ్యారాణి అన్నారు. మంగళవారం స్థానిక రాణిపేట ప్రాంతంలో శంఖారావం, సూపర్ సిక్స్ పథకాలపై ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలు అవస్థలు పడ్డారన్నారు. రాష్ట్రాన్ని దోచుకోవడమే పనిగా వైసీపీ పాలన సాగించిందని విమర్శించారు. ఇసుక, సిలికా తదితర సహజ సంపదలను దోచుకుని భావితరాలకు మనుగడ లేకుండా చేసిందన్నారు. చంద్రబాబు నాయుడుతోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమవుతుందని, త్వరలో జరిగే ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో శీలం కిరణ్‌కుమార్, పులిమి శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, నరసింహులు, శ్రీనివాసులు, పేటేటి వెంకటేశ్వరరావు, భారతి, లీలావతి, బాలసుబ్రమణ్యం, అరుణ్‌కుమార్, వెంకటేష్, రాజగోపాల్, మునియప్పన్, సాంబమ్మ తదితరులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి: లక్ష్మీసాయిప్రియ



వార్డు ఇన్‌చార్జిల సమావేంలో మాట్లాడుతున్న లక్ష్మీసాయిప్రియ

వెంకటగిరి, మార్చి 26: టీడీపీ మేనిఫెస్టోలో ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాల గురించి ప్రజల్లో విస్తృత ప్రచారం చేయాలని వెంకటగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కురుగొండ్ల లక్ష్మీసాయిప్రియ అన్నారు. మంగళవారం ఆమె తన నివాసంలో వార్డు ఇన్‌చార్జిలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టీడీపీ పట్ల ప్రజల్లో వున్న ఆదరణ చూస్తుంటే వెంకటగిరిలో గెలిచేది మనమేనని స్పష్టం అవుతోందన్నారు. బడుగు, బలహీన వర్గాల ప్రజలకు న్యాయం జరగాలంటే టీడీపీ అధికారంలోకి రావాలన్నారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక నియోజకవర్గంలో వనరులను కొల్లగొట్టడం తప్ప ఎలాంటి అభివృద్ధి చేయలేదని ఆరోపించారు. టీడీపీ అధికారంలోకి రాగానే అవ్వా, తాతలకు రూ.4 వేలు పెన్షన్ ఇస్తామని చంద్రబాబు ప్రకటించారని గుర్తు చేశారు. అలాగే సూపర్ సిక్స్ పథకాలు అమలు చేసి అందరికీ లబ్ధి చేకూరుస్తామని చెప్పారు. ఎవరిపైనైనా తప్పుడు కేసులు పెడితే భయపడవద్దని, తాను అండగా నేను నిలుస్తానని భరోసా ఇచ్చారు. పార్టీ కార్యకర్తలపై పెట్టిన కేసులను టీడీపీ అధికారలోకి రాగానే ఎత్తివేస్తామని యువగళం పాదయాత్రలో నారా లోకేశ్ మాట ఇచ్చారని చెప్పారు. కార్యక్రమంలో నాయకుడు పులికొల్లు రాజేశ్వరరావు, కేవీకే ప్రసాద్ నాయుడు, గంగాధర్, అవ్వారు సత్యం, పునుగోటి విశ్వనాథ నాయుడు, తాండవ చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళిపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దారు నాగరాజరావు

కోట, మార్చి 26: ఎన్నికల నేపథ్యంలో ఇమాంలు, చర్చి పాస్టర్లు అప్రమత్తంగా వ్యవహరించాలని తహసీల్దారు నాగరాజరావు కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం చర్చిల ఫాదర్లు, మసీదుల ఇమాంలకు ఎన్నికల నియమావళిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ ఎన్నికలు పూర్తయ్యే వరకు ఆయా మత పెద్దలు ఎన్నికల ప్రచారాలు చేయకూడదన్నారు. చర్చిలు, మసీదుల్లో సంక్షేమ పథకాలకు సంబంధించిన పోస్టర్లు, రాజకీయ నేతల పోస్టర్లను ఉంచరాదని, అలాంటివి ఉంటే మతపెద్దలే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. అనంతరం ఎన్నికల నియామవళిపై సచివాలయ ఉద్యోగులకు అవగాహన కల్పించారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దారు మల్లికార్జున్‌రావు, ఉద్యోగులు పాల్గొన్నారు.

వేసవిలో నీటి ఎద్దడి రాకుండా చూడండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో చంద్రమౌళి

సూళ్లూరుపేట, మార్చి 26: వేసవి నేపథ్యంలో గ్రామాల్లో నీటి ఎద్దడి రాకుండా చూడాలని ఎంపీడీవో చంద్రమౌళి అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శిలు, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీల్లో నీటి సమస్య తలెత్తకుండా ముందస్తుగా చర్యలు తీసుకోవాలన్నారు. వేసవిలో ఎండలు అధికంగా ఉన్న నేపథ్యంలో ప్రజల దాహార్తి తీర్చేందుకు అన్ని పంచాయతీ కార్యాలయాలు, ప్రధాన కూడళ్లట చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చూడండి: కలెక్టర్



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 26: వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని, చేతిబోర్ల మరమ్మతులు 24గంటల్లో పరిష్కరించాలని కలెక్టర్ లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో తాగునీటి ఎద్దడి, ఉపాధిహామీ తదితర అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. తాగునీటి బోర్ల మరమ్మతులకు 15వ ఆర్థిక సంఘం నిధులు వాడుకోవాలని తెలిపారు. రద్దీ ఉన్న ప్రాంతాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేసి మనుషులకే కాక పశుపక్షాదులకు నీరు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధి హామీ పథకంలో కూలీలకు వందరోజులు పనిదినాలు కల్పించాలన్నారు. నీటి సరఫరా సమస్యలపై జిల్లా కేంద్రంలో కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కంట్రోల్‌రూమ్ (0877-2236007)కు అందిన ఫిర్యాదులను 48 గంటల్లో పరిష్కరించాలని సూచించారు. అలాగే వీడియో కాన్ఫరెన్సు ద్వారా జిల్లా అధికారులకు దిశానిర్దేశం చేశారు. వీడియో కాన్ఫరెన్సుకు హాజరు కాని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు షోకాజ్ నోటీసులు ఇవ్వాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా తాగునీటి సరఫరా అధికారి విజయకుమార్, డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్, జిల్లా పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారి శంకరనారాయణ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.40 కోట్లు

తిరుమల, మార్చి26 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామికి హుండీ ద్వారా రూ.3.40 కోట్ల కానుకలు లభించాయి. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన కానుకలను టీటీడీ సోమవారం లెక్కించింది. సోమవారం 78,731 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు.

నేటినుంచి టీడీపీ విస్తృత ప్రచారం

తడ, మార్చి 26: నేటి నుంచి విస్తృతంగా ప్రచారం నిర్వహించేలా నాయకులంతా ప్రణాళికలు రూపొందించుకోవాలని టీడీపీ నాయకుడు కొండేపాటి గంగాప్రసాద్ అన్నారు. మంగళవారం సాయంత్రం తడకు వచ్చిన ఆయన స్థానిక భువనేశ్వరి ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం టీడీపీ నాయకులతో మాట్లాడారు. తడ మండలంలో భారీ మెజార్టీ సాధించేలా ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయాలని, అధికారంలోకి వచ్చాక అందరికీ సముచితస్థానం కల్పిస్తామని చెప్పారు. ఆయనతో పాటు టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్‌రెడ్డి, నాయకులు బొమ్మన పళణి, సెల్వం, సుదర్శన్, మాధవనాయుడు, ఏకాంబరం, రమేష్ తదితరులు ఉన్నారు.

టీడీపీ విజయానికి కృషి చేయండి



గంగాప్రసాద్‌ను సన్మానిస్తున్న ప్రవీణ్

సూళ్లూరుపేట, మార్చి 26: టీడీపీ విజయానికి అందరూ సమన్వయంతో పనిచేయాలని ఆ పార్టీ నేత కొండేపాటి గంగాప్రసాద్ అన్నారు. మంగళవారం ఆయన ఇంటి వద్ద టీడీపీ నాయకులతో సమావేశం అయ్యారు. అనంతరం జనసేన ఇన్‌చార్జి ఉయ్యాల ప్రవీణ్ కుమార్‌తో సమావేశమై చర్చించారు. టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి నెలవల విజయశ్రీ విజయానికి ప్రణాళికతో ముందుకు సాగుదామని నిర్ణయించారు. అనంతరం వైసీపీ నేత, చెంగాళమ్మ ఆలయ ట్రస్టుబోర్డు మాజీ చైర్మన్ హర్షవర్ధన్‌రెడ్డి సతీమణి వాణీని కోటపోలూరులోని ఆమె నివాసంలో కలిసి టీడీపీ చేరాలని ఆహ్వానించారు. ఇందుకు ఆమె సుముఖత వ్యక్తం చేసినట్లు తెలిసింది.

వైసీపీలో చేరిన వేనాటి

తడ, మార్చి 26: టీడీపీకి రాజీనామా చేసిన టీడీపీ సీనియర్ నాయకుడు వేనాటి రామచంద్రారెడ్డి వైసీపీలో చేరారు. మంగళవారం తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యతో తాడేపల్లిలో సీఎం జగన్ సమక్షంలో వైసీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారి వెంట ఎన్‌డీసీసీబీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, చెంగాళమ్మ ట్రస్టుబోర్డు చైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి ఉన్నారు.

టీడీపీకి మస్తాన్ యాదవ్ రాజీనామా

వెంకటగిరి, మార్చి 26: టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ మస్తాన్ యాదవ్ తో" పదవికి, టీడీపీ సభ్యత్వానికి రాజీనామా చేశారు. మంగళవారం ఆయన రాజీనామా లేఖను టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడికి పంపినట్లు తెలిపారు. అనంతరం తాడేపల్లిలో సీఎం జగన్ సమక్షంలో వైసీపీలో చేరారు.

భక్తులకు అందుబాటులో క్రోధినామ సంవత్సర పంచాంగం

తిరుమల, మార్చి26(ఆంధ్రజ్యోతి): క్రోధినామ సంవత్సర పంచాంగాన్ని టీటీడీ మంగళవారం నుంచి భక్తులకు అందుబాటులో ఉంచింది. వీటిని తిరుపతి, తిరుమలలోని టీటీడీ పుస్తక విక్రయశాలల్లో మంగళవారం నుంచి విక్రయాలను ప్రారంభించింది. ఈపంచాంగాన్ని రూ.75 చెల్లించి భక్తులు కొనుగోలు చేయవచ్చు. కాగా ఇతర ప్రాంతాలకు అందుబాటులోకి తీసుకురానుంది.

పదో తరగతి పరీక్షలకు 26,421 మంది హాజరు

తిరుపతి(విద్య), మార్చి 26: పదో తరగతికి సంబంధించి మంగళవారం జరిగిన బయాలజీ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 26,421 మంది విద్యార్థులు హాజరయ్యారు. 551 మంది గైర్హాజరయ్యారు. 97.95 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారని డీఈఓ చైతన్య చెప్పారు.

60 ప్యాకెట్ల మద్యం స్వాధీనం

తిరుపతి క్రైం, మార్చి 26: తిరుపతిలోని వెస్ట్ పోలీసులు 60 ప్యాకెట్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. కార్వేటినగరానికి చెందిన మధు ఎన్నికల నేపథ్యంలో నగరంలో విక్రయించడానికి మద్యం తీసుకొచ్చాడు.

యువత భవితతో జగన్ చెలగాటం



సమావేశంలో తెలుగు మహిళలు

గూడూరు అర్బన్, మార్చి 26: రాష్ట్రంలో డ్రగ్స్ మాఫియాకు సీఎం జగన్ అండగా నిలుస్తూ యువత భవితతో చెలగాటమాడుతున్నారని తెలుగు మహిళలు అన్నారు. మంగళవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో తెలుగు మహిళలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వంలో పెట్టుబడుల ఆకర్షణలో రాష్ట్రం మొదటిస్థానంలో ఉంటే వైసీపీ వచ్చాక డ్రగ్స్ రవాణాలో మొదటి స్థానంలో నిలబెట్టిందన్నారు. వైజాగ్‌ను రాజధానిగా చేస్తామని చెప్పి డ్రగ్స్ క్యాపిటల్‌గా మార్చేశారని విమర్శించారు. దేశంలో ఎక్కడ గంజాయి పట్టుకున్నా దాని మూలాలు మన రాష్ట్రంలోనే దొరుకుతున్నాయని అన్నారు. డ్రగ్స్ కుంభకోణం వెనుక తాడేపల్లి ప్యాలెస్ హస్తం ఉందని, బ్రెజిల్ నుంచి వచ్చిన డ్రగ్స్ కంటైనర్‌తో జగన్, ఆయన అనుచరుల మోసం బట్టబయలు అయిందన్నారు. యువత భవితను నిర్వీర్యం చేస్తూ తల్లిదండ్రులకు కడుపు కోత మిగుల్చుతున్న జగన్ తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో మట్టం శ్రావణి, గుండాల లీలావతి, భారతి, నరసమ్మ, తాళ్ల సుబ్బమ్మ, శ్రీదేవి, శ్యామల, కల్పన, విజయమ్మ తదితరులు పాల్గొన్నారు.

బాబుతోనే రాష్ట్రాభివృద్ధి



డేగపాలెంలో ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు

సూళ్లూరుపేట, మార్చి 26: అపార అనుభవం కలిగిన చంద్రబాబు సేవలు రాష్ట్రానికి అవసరమని పట్టణ అధ్యక్షుడు ఆకుతోట రమేష్ అన్నారు. మంగళవారం పట్టణంలో డేగపాలెంలో బూత్ కన్వీనర్ అమాస సతీష్ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మళ్లీ చంద్రబాబు ముఖ్యమంత్రి అయితే రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి చెందుతుందని, రాక్షస పాలనకు బుద్ధిచెప్పి టీడీపీని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ కార్యదర్శి ఏజీ కిషోర్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు కుదిరి పెంచలయ్య, ఆలీ బాయ్, జనసేన నాయకుడు పొన్నా కాటయ్య తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అళఘునాథస్వామికి రథోత్సవం



రథోత్సవంలో భక్తులు

గూడూరు, మార్చి 26: స్థానిక అళఘునాథస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భూదేవి, శ్రీదేవి సమేత అళఘునాథస్వామిని ప్రత్యేకంగా అలంకరించి పట్టణ పురవీధుల్లో వైభవంగా రథోత్సవం నిర్వహించారు. భక్తులు రథాన్ని లాగి మొక్కులు తీర్చుకున్నారు. రాత్రికి స్వామివారిని అశ్వవాహనంపై ఉంచి గ్రామోత్సవం జరిపారు.

విద్యతోనే ఉజ్వల భవిత



విద్యార్థినులకు సామాగ్రి అందజేస్తున్న సాయికృష్ణారెడ్డి

గూడూరు అర్బన్, మార్చి 26: విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని న్యాయవాది చిల్లకూరు సాయికృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక బాలసదనంలోని సాయికృష్ణారెడ్డి దాతృత్వంతో విద్యార్థినులకు అవసరమైన గ్లాసులు, సబ్బులు, ఇతర సామగ్రి, స్వీట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థినులు చిన్నతనం నుంచే లక్ష్యాలను ఎంచుకుని వాటిని సాధించుకునేందుకు కష్టపడి చదవాలన్నారు.

శ్రీవారి ఆలయంలో 9న ఉగాది ఆస్థానం

తిరుమల, మార్చి26(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంలో ఏప్రిల్ 9వ తేదీన క్రోధినామ సంవత్సర ఉగాది ఆస్థానం జరగనుంది. శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి, విష్వక్సేనుల స్వామికి వస్త్ర సమర్పణ చేస్తారు. శ్రీవారి ఉత్సవర్లను బంగారువాకిలిలో గరుడాళ్వారుకు అభిముఖంగా సర్వభూపాల వాహనంపై వేంచేపు చేస్తారు. శ్రీవారి ఉత్సవమూర్తుల పక్కనే మరో పీఠంపై స్వామి సర్వసైనాధ్యక్షుడు విశ్వక్సేనుల స్వామిని వేంచేపు చేసి శ్రీవారి మూలవిరాట్టుకు, ఉత్సవమూర్తులకు నూతన వస్త్రాలు ధరింపజేస్తారు. అనంతరం పంచాంగ శ్రవణం నిర్వహిస్తారు. తర్వాత అర్చకులు ఉగాది ఆస్థానాన్ని నిర్వహిస్తారు. ఇక ఏప్రిల్ నెలలో 5వ తేదీన అన్నమాచార్య వర్ధంతి, 7న మాసశివరాత్రి, 8న సర్వఅమావాస్య, 11న మృత్యుంజయంతి, 17 శ్రీరామనవమి ఆస్థానం, 18 శ్రీరామపట్టాభిషేకం, 19న సర్వఏకాదశి, 21నుంచి 23 వరకు వసంతోత్సవాలు నిర్వహించనున్నారు.